# విశాలాంధ్ర కృష్ణా జిల్లా

# 'మణప్పురం'లో ఉద్యోగి చేతివాటం

**- రూ.6కోట్ల విలువైన బంగారం మాయం**

**విశాలాంధ్ర-ఉయ్యూరు:** కృష్ణా జిల్లా కంకిపాడు మణప్పురం గోల్డ్ లోన్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేసే ఉద్యోగి బ్రాంచ్ కార్యాలయంలోని బంగారం చోరీ చేసి పరారైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. 15 రోజుల క్రితం బ్రాంచ్ కార్యాలయంలోని ఆరు కోట్ల విలువైన ఆభరణాలను అందులోనే పని చేస్తున్న మేనేజర్ పావని మరో వ్యక్తితోక్తి కలిసి చోరీ చేసి ఉడాయించింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలుపుతూ ఫైనాన్స్ కంపెనీ ఉద్యోగులు ఫిర్యా దు చేశారు. ఖాతాదారుల రికార్డులను పరిశీలించిన ఉద్యో గులు సుమారు 10 కిలోల బంగారం, 16 కేజీల వెండి ఆభరణాలను చోరీ అయినట్టు గుర్తించి నివేదిక తయారు చేశారు. దీనిపై కంపెనీ ఉద్యో గులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యా ప్తు చేపట్టారు. చోరీకి సహకరించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ప్రధాన నిందితురాలు పావని కోసం గాలిస్తున్నా మని పోలీసులు తెలిపారు. ఇదే బ్రాంచి లో గత రెండేళ్ల క్రితం అప్పటి మేనేజర్ నకిలీ డాక్యుమెంట్లతో గోల్డ్ కుంభకోణానికి పాల్పడిన విషయం విదితమే.

## ధూపం వేశారు, నగదు చోరీ చేశారు

**విశాలాంధ్ర-మచిలీపట్నం :** ధూపం వేస్తామని చెప్పి 50 వేల రూపాయల నగదు చోరీ చేసిన సంఘటన బుధవారం నగరంలో చోటుచేసుకుంది. స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం స్థానిక 1వ డివిజన్ హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన ఆత్మూరి శ్రీనివాసరావు దేవీ నవరాత్రులు సందర్భంగా ఇంట్లో ధూపం వేస్తామంటూ వచ్చి రూ.50 వేల నగదు చోరీకి పాల్పడ్డారు. కృష్ణా యూనివర్సిటీలో ఉద్యోగం చేస్తున్న ఆత్మూరి శ్రీనివాసరావు సమీప బంధువు పెళ్లి కావడంతో కుటుంబ అవసరాల నిమిత్తం 50 వేల రూపాయల నగదు ఇంట్లో దాచుకున్నారు. దసరా దేవి నవరాత్రుల్లో భాగంగా శక్తి పటంతో చందా కోసం ఇంటికి వచ్చిన కొంతమంది వ్యక్తులు అమ్మవారి కటాక్షంతో కుటుంబం చల్లగా ఉండాలంటే ధూపం వేసుకోవాల్సిందిగా ఇంటి యజమానినీ కొంత మంది వ్యక్తులు కోరారు. దసరాదేవి నవరాత్రుల్లో ఇంట్లో ధూపం వేసుకోవడం ఆచారంగా భావిస్తున్న కుంటుంబ యజమాని అంగీకరించడంతో ఇంట్లో ధూపం వేసే సమయంలో శ్రీనివాసరావు భార్య ఒక్కరే ఉన్నారు. దీంతో కొంతమంది వ్యక్తులు ఇంట్లో ధూపం వేస్తుండగా వారిలో ఒకరు తమ చేతివాటం చూపి రూ.50 వేలు చోరీ చేసి వెళ్ళిపోయారు. ఇంట్లో ఉన్న డబ్బు కనిపించక పోవడంతో ఒకసారిగా అవాకయ్యి, ఇంటికి వచ్చి చోరికి పాల్పడిన వ్యక్తులు ఎవరు అని వాకబు చేసి గత్యంతరం లేక పోలీసులను ఆశ్రయించి చిలకలపూడి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఇస్రో వర్క్‌షాప్‌లో కేయూ విద్యార్థుల ప్రతిభ

**విశాలాంధ్ర -మచిలీపట్నం :** భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) నిర్వ హించిన వర్క్‌షాప్‌లో కృష్ణా విశ్వవిద్యాల యం విద్యార్థులు పాల్గొన్నారు. స్పేస్ సిట్యేషనల్ అవేర్నెస్ స్పేస్ ట్రాఫిక్ మనేజ్మెంట్ అనే అంశంపై ఇస్రో ప్రధాన కార్యాలయం లో మూడు రోజులు పాటు నిర్వహించిన కార్యక్రమంలో విశ్వవిద్యాలయ భౌతికశాస్త్ర విభాగం కు చెందిన నలుగురు విద్యార్థులు పాల్గొన్నారు. ఇస్రో ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్షలో రెండు వేల మంది పాల్గొనగా 200 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. అందులో కృష్ణా విశ్వవిద్యాలయం నుంచి ఎంపికైన నలుగురు విద్యార్థులను ఉపకులపతి ఆచార్య జి జ్ఞానమణి అభినందించారు. ఈ కార్యక్రమంలో భౌతికశాస్త్ర విభాగం సహాయ ఆచార్యులు డా సల్మా బేగం తదితరులు పాల్గొన్నారు.

## ఖో ఖో జట్లకు కమిషనర్ మురళీకృష్ణ అభినందన

**విశాలాంధ్ర-గుడివాడ :** స్థానిక ఎస్‌పిఎస్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉమ్మడి కృష్ణాజిల్లా జూనియర్ బాల,బాలికల శిక్షణా శిబిరం బుధవారం ముగిసింది. ఈనెల 20వ తేదీ నుండి 22వ తేదీ వరకు బాల, బాలికల జూనియర్స్ విభాగంలో చిత్తూరు జిల్లాలో జరిగే 42వ రాష్ట్రస్థాయి ఖో- ఖో పోటీల్లో పాల్గొనే ఉమ్మడి కృష్ణాజిల్లా జట్లకు ఎస్పీఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాల నిర్వహించిన శిక్షణా శిబిరం బుధవారంతో ముగిసింది. జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్న క్రీడాకారులను మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ, మాజీ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ దేవు నరసింహారావు, ఖో- ఖో అసోసియేషన్ అధ్యక్షుడు మడకా ప్రసాద్‌లు అభినందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రాథమిక దశ నుండి క్రీడలపై ఆసక్తి పెంచుకొని రాణిస్తే ఉన్నత ఉద్యోగాలతో పాటు, చక్కని భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక ధృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణా జిల్లా కోకో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.వి.ఎస్ ప్రసాద్, కోశాధికారి జి.రామారావు, సంయుక్త కార్యదర్శి అనురాధ, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్ష పేదవాడికి రక్ష

**విశాలాంధ్ర-అవనిగడ్డ :** జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రతి పేదవాడికి రక్షణ కల్పిస్తుందని శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు అన్నారు. బుధవారం అవనిగడ్డ 5 వ సచివాలయ పరిధిలో సచివాలయ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎం.పి.డి.ఓ ఎం. మరియా దేవి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గోన్న సింహాద్రి రమేష్ బాబు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోని పేదలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను ఏర్పాటు చేసి గత 20 రోజులుగా ఇంటింటి సర్వే నిర్వహించి భాదితులను గుర్తించడం జరిగిందన్నారు.ఈ సురక్ష కేంద్రాల్లో బి.పి , షుగర్ తో పాటు 11 రకాల పరీక్షలను ఉచితంగా నిర్వహించి ఉచితంగా మందులు అందచేయడంతో పాటు ప్రత్యేక వైద్యులతో పరీక్షలు నిర్వహిస్తున్నారని, కంటి పరిక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్ళ జోళ్ళు అందిస్తున్నారని వచ్చే నెల నుండి వైద్య పరీక్షలు ఇంటి వద్దే రోగులను గుర్తించి వైద్య పరీక్షలు అందచేయడం జరుగుతుందన్నారు. పేదలను దృష్టిలో పెట్టుకుని విద్య వైద్యం అందించే విధంగా జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారని యావత్ దేశం మొత్తం మన రాష్ట్రం వైపు చూసేలా ప్రతిష్టాత్మకమైన మార్పులు తీసుకువచ్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. పేదలందరూ దీవించి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆదరించి ముఖ్యమంత్రిని చేయాల్సిన భాధ్యత పేదలపైనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గౌరుముచ్చు ఉమా, ఎం.పి.పి తుంగల సుమతీ దేవి, జడ్.పి.టి.సి చింతలపూడీ లక్ష్మీనారాయణ, ఎం.పి.టి.సి బొప్పన బాణు, నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, ఇ.ఒ పి.ఆర్.డి శైలజా కుమారి, వైద్యులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గోన్నారు.

## హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఏపీ ఛైర్మన్‌గా కొడాలి భక్తపాల్

**విశాలాంధ్ర-ఘంటసాల:** హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఛైర్మన్ గా ఘంటసాల మండలం పెద్దగూడెం గ్రామ నివాసి అయిన కొడాలి భక్తపాల్ నియమితులయ్యారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ సమావేశం సికింద్రాబాద్ లోని హెచ్ఆర్సి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ ప్రెసిడెంట్ (విమెన్ ఫ్రంట్) షీబా, సౌత్ ఇండియా ప్రెసిడెంట్ ఆఫ్ హెచ్ఆర్‌సి ఆర్.ఎస్.జే. థామస్ లు ఆంధ్రరాష్ట్ర హెచ్ఆర్సి నూతన కమిటీని ఎన్నిక చేశారు. కమిటీలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఛైర్మన్ గా కొడాలి భక్తపాల్‌ను ప్రకటించి నియామక పత్రాన్ని అందించి ఘనంగా సన్మానించారు. హెచ్ఆర్సీ ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షునిగా దిడ్ల కిరణ్ కుమార్, జనరల్ సెక్రటరీగా జాకబ్ కుమార్ పశుమర్తిని నియమించినట్లు ప్రతినిధులు తెలియజేశారు. హెచ్ఆర్సీ ఏపీ ఛైర్మన్గా బాధ్యతలు స్వీకరించిన కొడాలి భక్తపాల్ ను ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు అభినందనలతో శుభాకాంక్షలు తెలిపారు.

## దూరప్రాంత ప్రయాణీకులకు ప్రత్యేక బస్సులు

**విశాలాంధ్ర-మచిలీపట్నం :** విజయదశమి సందర్భంగా ప్రయాణీకుల సౌకర్యమై హైదరాబాద్ నుండి మచిలీపట్టణంకు బుధవారం నుండి 22వ తేదీ వరకు ప్రతి రోజు రాత్రి సాధారణ ఛార్జీతో స్పెషల్ బస్సులు నడుపుతున్నామని, బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పండుగ తరువాత 23వ తేదీ నుండి 26వ తేదీ వరకు మచిలీపట్టణం నుండి హైదరాబాద్, విశాఖపట్నంకు అదనంగా స్పెషల్ బస్సులు, ఈ స్పెషల్ బస్సులకు రిజర్వేషన్ సౌకర్యము కలదు. రాను పోను ప్రయాణమునకు ఒకేసారి టిక్కెట్లు రిజర్వేషన్ చేయుంచుకొన్నచో టికెట్ చార్జీ లో 10 శాతం రాయితీ ఇస్తారని, ప్రయాణీకులు ఈ అవకాశమును వినియోగించుకొని ఆర్టీసీ బస్సులలో ఈ సుఖవంతమైన, సురక్షిత ప్రయాణం చేసి పండుగ సెలవులను ఉల్లాసంగా ఉత్సహంగా గడపాలని పెద్దిరాజు తెలిపారు.

# మాకు ప్రాణహాని ఉంది

**-పోలీసుల తీరుపై కొల్లు నీలిమ ఆవేదన**

**-కావాలనే నాభర్తను చిత్రహింసలకు గురిచేస్తున్నారు**

**విశాలాంధ్ర-మచిలీపట్నం :** నేడు జగన్ అండదండలతో పోలీసు అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అబాసబాలు చేస్తున్నారని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ పోలీసు వ్యవహారాన్ని ఆమె దుయ్యబట్టారు. బుధవారం సర్కిల్ పేటలోని ఆమెను నివాసంలో పాత్రికేయులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో జగన్ పరిపాలన అధ్వానంగా ఉందని, ప్రశ్నించే వారిని, నోరు నొక్కుతున్నారని, పోలీసులతో అనగదొక్కాలని చూడడం చాలా దారుణం అన్నారు. మాజీ మంత్రి కొల్లు రవీంద్రను కావాలనే చిత్రహింసలు పెడుతున్నారని, పిల్లలు పెద్దలు ఉన్నా ఇంట్లో మా కుటుంబాన్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ఈ పోలీసుల వ్యవహార శైలి చూస్తే పోలీస్ శాఖ వల్లే నా భర్త అయిన కొల్లు రవీంద్రకు ప్రాణహాని ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. గత రెండు రోజుల నుంచి బీసీ నాయకుడు మాజీ మాజీ మంత్రి, లాయరు, తెలుగుదేశం పార్టీ పోలీస్ బ్యూరో అయిన నా భర్తను పోలీసులు కావాలనే మా ఇంటి గుమ్మం కూడా దాటకుండా వందలాది మంది పోలీసులతో పహారా కాస్తున్నారని, ఎందుకు,ఏమిటి అని ప్రశ్నిస్తే పైనుంచి మాకు ఉత్తర్వులు ఉన్నాయని పోలీసులు చెప్పడం చాలా దారుణమని, పైనుంచి పోలీస్ శాఖకు ఆర్డర్ వేస్తున్న వ్యక్తి ఎవరో మాకు తెలియాలని, అలాగే నా భర్తని తెలుగుదేశం పార్టీ నాయకులను చిత్రహింసలను పెట్టడం తో పాటు ఎక్కడికి తీసుకెళ్తున్నారు? ఎందుకు తీసుకెళ్తున్నారు? కూడా పోలీసులు ఏ విధమైన సమాచారం అందించట్లేదని దానివలన హైకోర్టుని ఆశ్రయించడం జరిగిందని ఆమె తెలిపారు. మా సొంత దేవాలయానికి కూడా పూజలు చేసుకునేందుకు వెళ్ళనీయకుండా పోలీసులు అడ్డుపడడాన్ని ఆమె తప్పు పట్టారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ అనిత మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

## జగనన్నకు చెబుదాం

**విశాలాంధ్ర-ఉయ్యూరు:** స్థానిక కాకర్ల కన్వెన్షన్ హాల్ లో కలెక్టర్ పి. రాజబాబు సమక్షంలో జగనన్న కు చెబుదాం ను బుధవారం నిర్వహించారు. మండల స్థాయిలో జరిగిన ఈ సమావేశంలో .. ప్రజలు తమ సమస్యలను లిఖిత పూర్వకంగా తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మక పథకాల్లో జగనన్న కు చెబుదాం ఒకటని కలెక్టర్ రాజబాబు అన్నారు. స్థానిక అధికారులు వచ్చిన పిర్యాదులను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సారథి అన్నారు. ఇందులో జాయింట్ కలెక్టర్ డా . అపరాజిత సింగ్ పాల్గొన్నారు.

రెండు రోజుల్లో నీరు ఇవ్వకపోతే

# సాగునీటి ఉద్యమం

**మండలి బుద్ధప్రసాద్**

**విశాలాంధ్ర-నాగాయలంక :** సాగునీటి ఎద్దడి లేదని ప్రకటించిన కృష్ణా జిల్లా కలెక్టర్ రెండు రోజులలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, చివరి భూములకు సాగునీరు ఇవ్వకపోతే సోర్లగొంది గ్రామంలోని ఎండిపోయిన పొలాల నుండే ఉద్యమం మొదలుపెడతానని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బుధవారం నాగాయలంక మండలంలో సాగునీరు లేక ఎండిపోయిన పొలాలను ఆయన పరిశీలించారు. గత ప్రభుత్వంలో అధికారులు క్షేత్రస్థాయిలో తిరుగుతూ సాగునీటికి ఇబ్బందులు లేకుండా చేసేవారని, నేడు ఏఈ, డిఈలు కూడా కనిపించడం మానేశారని అన్నారు. ఈ ప్రాంతానికి 2000 క్యూసెక్కుల నీరు ఇవ్వాల్సిన ప్రభుత్వం అరకొరగా కేవలం 500 క్యూసెక్కుల నీరు మాత్రమే వదులుతున్నారని అన్నారు. చిత్తశుద్ధి గల ప్రభుత్వం అయితే రెండు రోజులలో క్షేత్రస్థాయిలో పరిశీలించి, సాగునీటిని విడుదల చేయకపోతే సోర్లగొందిలో ఎండిపోయిన పొలాల నుండే ఉద్యమం మొదలుపెడతామని బుద్ధప్రసాద్ స్పష్టం చేసారు.ఈ కార్య క్రమం లో జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యన్నారాయణ, తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్, నాగాయలంక మండల అధ్యక్షులు మెండు లక్ష్మణరావు, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షులు మండవ బాలవర్ధి,తదితరులు పాల్గొన్నారు.

# మురికి నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

**విశాలాంధ్ర-పెడన :** పెడన పట్టణ శివారు బందర్ రోడ్డు రైల్వే ట్రాక్ వెంబడి మురుగు నీటి అవుట్ లెట్ సమస్యకు అతి త్వరలో శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టనున్నట్లు పి మధుసూదన్ రావు మునిసిపల్ కమిషనర్ మహేంద్ర పేర్కొన్నారు.. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 15 వార్డు ప్రజలు మురుగు నీటి వల్ల ఇబ్బందులు పడుతున్నామని, అవుట్ లెట్ సమస్యను పరిష్కరించాలని ఆ ప్రాంత ప్రజలు మంత్రి జోగి రమేష్ ను కోరారు. ఈ క్రమంలో మంత్రి ఆదేశాల మేరకు రెవెన్యూ, మున్సిపల్ అధికారులు బుధవారం సాయంత్రం బందర్ రోడ్ లోని రైల్వే ట్రాక్ వెంబడి మురుగునీటి ముంపు కు గురవుతున్న ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ త్వరలో రైల్వే శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి మురుగునీటి అవుట్ లెట్ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు బండారు మల్లికార్జునరావు, 15వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ అప్సర్ జః ఖాదర్ జిలాని, పెడన మున్సిపల్ చైర్ పర్సన్ తనయులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం నాయకులు కటకం నాగ కుమార్, పెడన సచివాలయాల కన్వీనర్ మతిన్ ఖాన్, మునిసిపల్ ఏఈ రామాంజనేయులు,తదితరులు పాల్గొన్నారు.

## నిడుమోలులో 'బాబుతో నేను'

**విశాలాంధ్ర-కూచిపూడి :** మానవ రూపం లోని రాక్షసుడు జగన్ రెడ్డని అయనది లిప్రత్యర్థుల్ని హింసించి ఆనందించే క్రూరమనస్తత్వమని పామర్రు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త వర్ల కుమార్ రాజా మండిపడ్డారు. మొవ్వ మండలం నిడుమోలులో బుధవారం నిర్వహించిన 'బాబుతో నేను' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కథల్లో చదువుకున్న రాక్షసులకు, ప్రస్తుతం రాష్ట్రాన్ని పాలిస్తున్న జగన్ రెడ్డికి ఏమాత్రం తేడా లేదని. ప్రజల్ని, ప్రత్యర్థుల్ని వేధించి, హింసించి నాడు రాక్షసులు ఆనందిస్తే, నేడు జగన్ రెడ్డి అంతకు మించిన కరత్వంతో వ్యవహరిస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నాడని తీవ్రస్థాయిలో విమర్శించారు చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూచంద్రబాబుపై కేసు నమోదు చేయడం తప్ప, ఒక్క కేసులో కూడా రూపాయి చంద్రబాబుకు చేరిందనడానికి ఆధారం చూపలేకపోయారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు లింగమనేని రామలింగేశ్వర రావు, మచిలీపట్నం పార్లమెంటు ఉపాధ్యక్షులు నన్నపనేని వీరేంద్ర , గ్రామ పార్టీ అధ్యక్షులు జొన్నలగడ్డ రవి, గ్రామ కార్యదర్శి గొంతుపులి రాము,గొంతుపులి వెంకటేశ్వరరావు,మస్తాన్ పఠాన్, మండల కార్యదర్శివీరంకి తులసీదాసు,యద్దలపూడి రాఘశేఖర్,రాజులపాటి పెద్ద మస్తాన్,ఈడే శ్రీనివాసరావు,భోగాది నాగేశ్వరావు, ఈడే సుబ్రమణ్యం, ఈడే మధు,,వాజితుల్లా షరీఫ్,బత్తిన శ్రీనివాసరావు, అప్పారావు,, మురారి నాగరాజు, స్థానిక నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళలపై దురుసుగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు

**దిశ పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసిన ఏలూరు రేంజ్ డీఐజీ**

**విశాలాంధ్ర-మచిలీపట్నం :** మహిళల పట్ల దురుసుగా ప్రవర్తించే వారిని కఠినంగా శిక్షిస్తామని ఏలూరు రేంజ్ డీఐజీ జివిజి అశోక్‌కుమార్ అన్నారు. సాదారణ తనిఖీలో భాగంగా దిశ పోలీస్‌స్టేషన్‌ను ఆయన బుధవారం తనిఖీ చేశారు. మొదట్ గా పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం దిశ పోలీసు స్టేషన్ రికార్డులను తనిఖీచేసి సిబ్బందికి కొన్ని సూచనలు చేశారు. దిశ పోలీస్‌స్టేషన్ ఫ్యామిలీ కౌన్సిలింగ్ మెంబర్స్‌ను కలిసి ఫిర్యాదుదారుల కౌన్సెలింగ్‌పై వాకబు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా మచిలీపట్నం దిశ పోలీస్‌స్టేషన్‌కు వచ్చానని, కేసులు తాలూకా సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. నగరంలో మహిళల పట్ల ఎవరైనా అనుచిత వ్యాఖ్యలు చేసినా, మహిళలను ఇబ్బంది పెట్టినా, ఇబ్బందులు పడుతున్నా వెంటనే దిశ పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేస్తే పోలీసులు వెంటనే చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ జాషువా, మచిలీపట్నం నగర డీఎస్పీ మాధవరావు, పోలీస్ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జగన్మాతకు సినీ స్వర నీరాజనాలు

**విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ :** తెలుగు కళావాహిని, జి ఆర్ కె పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి సంయుక్త ఆధ్వర్యంలో దసరా నవరాత్రి ఉత్సవాలలో మహాలక్ష్మి అవతారం రోజున బుధవారం సాయంత్రం హనుమంతరాయ గ్రంథాలయం హాలులో జరిగిన సినీ సంగీత విభావరి జగన్మాతకు స్వర నీరాజనాలర్పిస్తూ సాగింది. గాయనీ గాయకులుగా స్వాతి, ఉషా రెడ్డి, మాధవి, దుర్గా నాగమణి, వి కామేశ్వరి, మద్దెల శ్యాం ప్రసాద్, డేవిడ్ రాజు, మస్తాన్ వలి, దండు చంద్రశేఖర్, వెంకట్, కె వి బి ఆనంద్, సుదర్శన రాజు తదితరులు కొండపై నిండుగా కొలువున్న మా తల్లి, అమ్మా పరమేశ్వరి జననీ జగదీశ్వరి, ఓం శర్వాణి ఓం రుద్రాణి ఓం ఆర్యాణి, ప్రణవాలయ పాహి పరిపాలయ పరమేశి

వంటి అమ్మవారి భక్తి చిత్ర గీతాలను రసరమ్యంగా పాడి వినిపించారు. వ్యాఖ్యాతగా డేవిడ్ రాజు వ్యవహరించగా కార్యక్రమ పర్యవేక్షణ చింతకాయల చిట్టిబాబు చేశారు.

### నిరుపేద కుటుంబానికి కుట్టు మిషన్ వితరణ

**విశాలాంధ్ర-ఘంటసాల:** జీవనాధారం లేక అనేక ఇబ్బందులు పడుతున్న ఒక నిరుపేద కుటుంబానికి కుట్టు మిషన్లు అందించి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, గోగినేని పాలెం ప్రధానోపాధ్యాయులు తమ్మన వేణుగోపాలరావు తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబాన్ని పోషిస్తున్న స్త్రీ, చిన్న వయసులోనే భర్తను పోగొట్టుకొని తన కుటుంబ భారాన్ని, కుటుంబ పోషణను తన నెత్తిన వేసుకుని ఇబ్బంది పడుతూ, విధి వక్రీకరించి, దురదృష్టవశాత్తు పెళ్లయిన కొంతకాలానికే చేయూతనిచ్చే మరికొంత కాలానికి కన్న తండ్రిని కూడా కోల్పోయి, తనతో పాటుగా వృద్ధాప్యంలో ఉన్న తల్లిని నాలుగేళ్ల వయసున్న తన కొడుకును పోషించుకోలేక అనేక ఇబ్బందులు పడటం తనను కలచి వేసిందన్నారు విషయాన్ని తెలుసుకుని, నా వంతు సాయంగా ఆకుటుంబాన్ని తన శక్తి మేరకు కొంతవరకైనా ఆదుకోవాలని తలంచి, వెంటనే 4 వేలు రూపాయలు ఖరీదు చేసే మంచి కుట్టుమిషన్ ను ఆ కుటుంబానికి ఆసరాగా అందించినట్లు తెలిపారు.

## చల్లపల్లిలో బాబు తో నేను

**విశాలాంధ్ర-చల్లపల్లి :** టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చే సిన వైనాన్ని ప్రజలకు తెలియ చేసేలా చేపట్టిన "బాబుతో నేను" కార్యక్రమం చల్లపల్లి మండల తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం వెలివోలు గ్రామంలో జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా నేత, క్లస్టర్ ఇన్చార్జి మోర్ల శివ, సర్పంచ్ వేములమడ రజిత, యూనిట్ ఇన్చార్జి దేవభక్తుని గోపాలకృష్ణ, టీడీపీ అధ్యక్షుడు మురాల నాగేశ్వరావు, బొల్లా ఫణిబాబు, వాసిరెడ్డి రాకేష్, రాజులపాటి జగదీష్, పడమట వెంకటస్వామి, మురాల శ్రీను, బొల్లా శోభనాద్రి, అంకారావు, సుబ్రహ్మణ్యం, వీరంకి చిట్టిబాబు, పరిశె రఘు తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి బాబుతో నేను కరపత్రాలను ప్రజలకు అందించి రాజకీయ కక్షతో చంద్రబాబును అరెస్ట్ చేసిన విధానాన్ని ప్రజలకు తెలియచేశారు. చంద్రబాబుకు పలువురు మద్దతు తెలియచేస్తూ మిస్డ్‌కాల్ ఇచ్చారు.

### క్రీడా పరికరాలు వితరణ

**విశాలాంధ్ర-పమిడిముక్కల:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తాడంకి కి ఎన్ఆర్ఐ యర్రపోతు భాస్కర సాయి చంద్ర క్రీడా పరికరాలను వితరణ చేశారు.బుధవారం సదరు పాఠశాల ఇటీవల జిల్లా స్కూల్ ఎక్సెలెన్స్ అవార్డులలో తాడంకి పాఠశాల ద్వితీయ స్థానంలో నిలిచింది.ఈ సందర్భంగా తన గ్రామం లోని పాఠశాల కు రూ.50 వేలు విలువ చేసే క్రీడా పరికరాలను ఎన్ఆర్ఐ యర్రపోతు భాస్కర సాయి చంద్ర ( సిడ్నీ) తన సోదరుడు యర్రపోతు ప్రభాకర్ చేతులు మీదుగా హెచ్ఎం, వ్యాయమ ఉపాధ్యాయులు కి అందచేశారు. యర్రపోతు ప్రభాకర్ మాట్లాడుతూ క్రీడలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వై.ఎస్.ఎన్.ప్రసాద్ వ్యాయామ ఉపాధ్యాయుల ఎ.పి.రాజు పి.రవీంద్ర బాబు వైసీపీ నాయకులు కె.రాంబాబు యేనుగ మస్తాన్ రావు తదితరులు పాల్గొన్నారు.

### నేడు కంకిపాడుకు సీఎం జగన్

**విశాలాంధ్ర-కంకిపాడు:** ముఖ్యమంత్రి జగన్ గురువారం ఓ వివాహ వేడుకకు రానున్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి నాని సమీప బంధువు వివాహం జరగనుంది. జగన్ పర్యటన నేపథ్యంలో కలెక్టర్ రాజబాబు, ఎమ్మెల్యే కొడాలి నాని మండపాన్ని పరిశీలించారు.

# హిట్లర్‌ని మించిపోతున్న సీఎం జగన్ : గురుమూర్తి

**విశాలాంధ్ర-విజయవాడ :** సీఎం జగన్ అరాచకం, నియంతృత్వం రోజు రోజుకూ పెచ్చుమీరుతోందని ప్రజలు రోడ్డెక్కితే అరెస్టు, నిరసన తెలిపితే అరెస్టు, నోరెత్తితే నోటీసు అనేలా వ్యవహరించడం దుర్మార్గమని తెలుగుదేశం పార్టీ బీసీ సాధికార సమితి ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయం ఆటోనగర్ ఆవరణలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ విభాగం ఆధ్వర్యంలో నారా భువనేశ్వరికి సంఘీభావంగా, కొల్లు రవీంద్ర తన తల్లి వర్ధంతికి లో పాల్గొనకుండా నియంత్రించినం దుకు, రాష్ట్రవ్యాప్తంగా బీసీ నాయకులను భువనేశ్వరిని కలవకుండా నిర్బంధించినందుకు నిరసనగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలను నిరసించే హక్కు ప్రజలకు రాజ్యాంగం కల్పించిందన్నారు. పౌర హక్కుల్ని, ప్రజాస్వామ్యాన్ని హరించేలా వ్యవహరిస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. చంద్రబాబును అక్రమ కేసులో జైల్లో పెట్టి పైశాచిక ఆనందం పొందుతున్న జగన్ ఇప్పుడు చంద్రబాబు సతీమణికి సంఘీభావం తెలిపేందుకు ఎవరూ రాకూడదని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. మరోవైపు తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షులు కొల్లు రవీంద్రను రెండు రోజులుగా గృహ నిర్బంధంలో ఉంచడం దుర్మార్గం. వారి తల్లి వర్ధంతి కార్యక్రమాలకు కూడా వెళ్ల నీయకుండా, బంధువులెవరూ వారి ఇంటికి రాకుండా అడ్డుకోవడాన్ని మించిన నియంతృత్వం ఇంకోటి ఉండదు అన్నారు. జగన్మోహన్‌రెడ్డి అనే పిచ్చి తుగ్లక్ రెడ్డికి కూడా అంతకు మించిన దుస్థితి తప్పదని గురుమూర్తి హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు పేరెపి ఈశ్వర్, రాష్ట్ర నగరాల సాధికార కమిటీ కన్వీనర్ మరుపిల్ల తిరుమలేష్, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శులు వల్లూరు మధుసూదన్ రావు, బెజవాడ తిరుపతి గౌడ్, పీతా గోపీచంద్, కృష్ణ,ఎన్టీఆర్ జిల్లాల గౌడ సాధికార కమిటీ కన్వీనర్లు సొంటి శివరాం ప్రసాద్ గౌడ్, పామర్తి కిషోర్ బాబు, ఎన్టీఆర్ జిల్లా వడ్డెర సాధికార కమిటీ కన్వీనర్ బత్తుల దుర్గారావు, ఎన్టీఆర్ జిల్లా తూర్పు కాపు సాధికార కమిటీ కన్వీనర్ కరణం వెంకటరమణ, రాష్ట్ర సంచార జాతుల నాయకులు కత్తుల మణికంఠ, బీసీ నాయకులు బలగం కొండ, సింగం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

# విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

# శ్రీమహాలక్ష్మిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ

- ఇంద్రకీలాద్రిపై కొనసాగుతున్న దసరా ఉత్సవాలు
- శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై భక్తుల సంతృప్తి
- అమ్మవారిని నృత్య నీరాజనాలు అర్పిస్తున్న కళాకారులు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమై నేటికి 4 రోజులు. మహాలక్ష్మీ దేవి రూపంలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచే భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న ప్రతి భక్తుడు ఎంతో సంతృప్తికరంగా ఆనంద పారవశ్యంతో అమ్మవారి నిత్యాన్నదానాన్ని తృప్తిగా స్వీకరిస్తున్నారు. ముఖ్యంగా ఎక్కడా ఎటువంటి అసౌకర్యం లేకుండా దేవస్థానం చేసిన ఏర్పాట్లు వారికి ఎంతో సంతోషాన్ని కలగజేసాయి. క్యూ లైన్ లో ఉన్న వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. రాష్ట్రంలోని భక్తులే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా వచ్చిన భక్తులు ఈ దేవస్థానంలో సామాన్య భక్తుల దర్శనం కోసం చేసిన ఏర్పాట్లు ఎంతో బాగున్నాయని దేవస్థానం యంత్రాంగాన్ని ప్రశంసిస్తున్నారు. అందరితో సమానంగా దర్శనం చేసుకోలేని ప్రత్యేక ప్రతిభావంతులు, వృద్ధుల కోసం చేసిన ఏర్పాట్లు మరే ఇతర దేవస్థానంలోనూ లేవని చెప్పడం గమనార్హం. ఇదే క్రమంలో దర్శనం కోసం వస్తున్న భక్తులకు వారు ఉంటున్న ప్రదేశంలోనికి మంచినీరు, మజ్జిగ, పసి పిల్లల కోసం వేడి పాలను సైతం క్యూ లైన్ లో అందించడం ఒక నూతన ఒరవడిగా వారు అభివర్ణిస్తున్నారు. అకస్మాత్తుగా ఎవరైనా అనారోగ్యం వల్ల కానీ, ఇతరేతర కారణాలతో కానీ కళ్ళు తిరిగి పడిపోయినప్పుడు అవసరమైన వైద్య సేవలు కూడా తక్షణమే అందించేందుకు దేవస్థానం పాలకమండలి చేసిన ఏర్పాట్లు గతంలో ఎప్పుడూ చూడలేదని ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వ్యాఖ్యానించడం విశేషం. భక్తులకు అవసరమైన ప్రతి అవసరాన్ని తీర్చేందుకు వేలాదిమంది స్వచ్ఛంద కార్యకర్తలు నిరంతరం భక్తులకు అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన సహాయాన్ని అందిస్తున్నారు. ఈ దేవస్థానంలో కొన్ని వందల సంవత్సరాలుగా శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయి. కానీ ఈ ఏడాది మాత్రం సాధారణ భక్తులను దృష్టిలో పెట్టుకుని చేసిన ఏర్పాట్లు మాత్రం క్రమ పద్ధతిలో సాగుతున్నాయని భక్తులు తమ అనుభవాలను చెప్పడం దేవస్థానం పాలకమండలి చేసిన ఏర్పాట్లలో ఎటువంటి లోపాలు లేవనేందుకు ఒక ఉదాహరణ. ప్రత్యేక దర్శనాల ద్వారా వస్తున్న వారికి కల్పించిన సౌకర్యాలనే సాధారణ భక్తులకు కూడా ఈ దేవస్థానం పాలకమండలి అందిస్తోందని సాధారణ భక్తులు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఎంత రద్దీగా ఉన్నప్పటికీ నియంత్రించేందుకు అధికార యంత్రాంగం, స్వచ్ఛంద కార్యకర్తలు సమన్వయంతో భక్తుల ఇబ్బందులను, సమస్యలను తక్షణమే గుర్తించడం ఒక మంచి విధానమని భక్తులు చెప్పుకుంటున్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. డిల్లీ రావు, సబ్ కలెక్టర్ అదితి సింగ్, శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.ఎస్. రామరావు, నగర పోలీస్ కమిషనర్ కాంతిరాణా టాటా, పాలకమండలి చైర్మన్ కర్నాటి రాంబాబు నిరంతరం భక్తుల అవసరాలను గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. భక్తులకు ఎక్కడైతే ఇబ్బంది తలెత్తుతుందో ఆ సమస్యను పరిష్కరించేందుకు తక్షణమే చర్యలు చేపట్టడం భక్తులకు ఎంతో సంతోషాన్నిస్తోంది.

### భక్తులతో గౌరవంగా మెలగాలి : సీపీ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భక్తులతో గౌరవంగా మెలగాలని ఎన్టీఆర్ జిల్లా సీపీ కాంతి రాణా అన్నారు. బుధవారం శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో బాగంగా నాల్గవ రోజు టెంపుల్ పరిసర ప్రాంతాలలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను అధికారులతో కలిసి స్వీయ పర్యవేక్షణ చేస్తూ బందోబస్త్ సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు. మహామండపం వద్ద నుండి అంతరాలయం, దర్శనం అనంతరం బయటకు వచ్చు మార్గం గుండా నడుచుకుంటూ కనకదుర్గా నగర్, అన్న ప్రసాద వితరణ ప్రదేశం, ప్రసాదం కౌంటర్ల వద్ద రద్దీని గమనిస్తూ ప్రతి సెక్టార్ లో విధులు నిర్వహించు అధికారులకు, సిబ్బందికి ఎక్కడా ఎటువంటి పొరపాట్లు జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు. మరియు సలహాలు

ఇవ్వడం జరిగింది. ఈ వేడుకలలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అందరికి అమ్మవారి దర్శనం అయ్యేవిధంగా, అంతే కాకుండా ఉత్సవాలకు వచ్చిన వృద్ధులు, దివ్యాంగులు ఎక్కడా ఇబ్బందులు పడకుండా ప్రశాంత వాతావరణంలో అమ్మవారి ఉద్దేశం తో ప్రత్యేక పోలీస్ సేవాదల్ ను ఏర్పాటు చేసి, వారితో నగర పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ అమ్మవారి దర్శనం కోసం వచ్చిన వృద్ధులు, వికలాంగులకు సేవ చేయడానికి ఏర్పాటు చేయడం జరిగిందని, వారికి అమ్మవారి దర్శనం అయ్యేవిధంగా వారికి సహకరించాలని, ప్రేమపూర్వకంగా నడుచుకోవాలని ప్రత్యేకంగా తెలిపారు. డి.సి.పి. విశాల్ గున్ని, ఏ.ఐ.జి. ఎం.రవీంద్ర బాబు, ఆలయ ఈ.ఓ. కె.ఎస్.రామారావు, సి.ఎస్.బి.ఏ.డి.సి.పి. సి.హెచ్. లక్ష్మీపతి, వన్‌టౌన్ సీఐ సురేష్‌రెడ్డి తదితలు ఉన్నారు.

## మూలా నక్షత్రం రోజు వీఐపీ దర్శనాలు రద్దు

**మూలా నక్షత్రం రోజు వృద్ధులు దివ్యాంగులు అమ్మవారి దర్శనానికి రావద్దు : కలెక్టర్ డిల్లీరావు**

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఈ నెల 20 వ తేదీ శుక్రవారం కనక దుర్గ అమ్మ వారి జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రం రోజు రాష్ట్ర నలుమూలల నుండి దాదాపు రెండు నుండి రెండున్నర లక్షల మంది భక్తులు అమ్మ వారి దర్శనం కొరకు తరలి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని మూలా నక్షత్రం రోజు విఐపి అంతరాలయం దర్శనాలను రద్దు చేయటం జరిగిందని ఆయన తెలిపారు. కొండ పైకి ఎటువంటి వాహనాలను అనుమతించటం లేదని కేవలం క్యూ లైన్ల ద్వారా మాత్రమే భక్తులు అమ్మవారి దర్శనం చేసుకోవలసి వుంటుందని తెలిపారు. వయోవృద్ధులు వికలాంగులు అనారోగ్యం తో యిబ్బంది పడే వారు మూలా నక్షత్రం రోజు దర్శనం కొరకు వచ్చి ఇబ్బందులు పడతారని, దీనిని దృష్టిలో పెట్టుకొని 20 తేదీ శుక్రవారం అనంతరం అమ్మవారి దర్శనం ఏర్పాటు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీ రావు ప్రకటనలో కోరారు.

## నేడు శ్రీమహాచండీ దేవి రూపం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): శరన్నవరాత్రి ఉత్సవాల్లో శ్రీకనకదుర్గమ్మవారు శ్రీ మహా చండి దేవిగా దర్శనమిస్తారు. దేవతల కార్యసిద్ధి, దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం మహాలక్ష్మి మహాకాళీ, మహాసరస్వతీ, త్రిశక్తి, స్వరూపణిగా శ్రీమహా చండీ అమ్మవారు ఉద్భవించింది. శ్రీ చండీ అమ్మవారిలో అనేక మంది దేవతలు కొలువై ఉన్నారు. శ్రీ మహా చండీ అమ్మవారిని ప్రార్థిస్తే సర్వదేవతలను ప్రార్థించినట్లే. శ్రీఅమ్మవారి అనుగ్రహం వలన విద్య, కీర్తి, సంపదలు లభించి శత్రువులు విత్రులుగా మారటం, ఏ కోరికలతో ప్రార్దిస్తామో ఆ కోరికలు అన్నీ సత్వరమే లభిస్తాయి.

## పోలీసు అమరవీరుల సంస్మరణ సభకు పకడ్బందీగా ఏర్పాట్లు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం నందు భద్రతా ఏర్పాట్లను ఎన్టీఆర్ జిల్లా సీపీ కాంతి రాణా పర్యవేక్షించారు. ఈనెల 21వతేదీన ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జరగబోతున్న పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్ర మం సందర్భంగా బుధవారం సీపీ కాంతి రాణా ఇందిరా గాంధీ మునిసి పల్ స్టేడియంలో జరుగుతున్న భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, పోలీస్ అమర వీరుల సంస్మరణ కార్యక్రమంలో పాల్గొనడానికి వి.వి.ఐ.పి.లు, విఐపిలు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం కు వస్తారు కనుక స్టేడియంలో కట్టు దిట్టమైన భద్రత, పటిష్ట బందోబస్తు ఏర్పాటు పర్యవేక్షించారు. స్టేడియం పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని, భద్రతా పరంగా ఎటువంటి చిన్న లోపాలు లేకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకొవాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం పోలీస్ పరేడ్ ను పర్యవేక్షించి తగు సూచనలును చేశారు. డీసీపీ విశాల్ గున్ని, ఏఐజీ ఎం.రవీంద్రబాబు, ట్రాఫిక్ ఏడీసీపీ డి.ప్రసాద్, సీఏఆర్ ఏసీపీ చెంచిరెడ్డి, పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I, **NUTHULAPATI ANNAPURNA** (OLD NAME), **W/o. NUTHULAPATI VENKATESWARA RAO,** R/o. D.No. 6-10, Devinenivari Street, Gollapudi , Vijayawada Rural-521225, NTR District. I Changed my name to **NUTHULAPATI ARUNA DEVI.** Henceforth, I will be Known as **NUTHULAPATI ARUNA DEVI.**

**CHANGE OF NAME**

I, **BALLA NAGA VENKATA GANGA SAVITHRI ANANTHA LAKSHMI (Old Name),** W/o. DONTHAMSETTI SRINIVAS GANESH, resident of Flat-408, KAIZEN Seetaramaswamy Residency, Street No.2, Sri Kanakadurga Nagar, Gunadala, Vijayawada-52008, A.P. I have changed my name as **DONTHAMSETTI ANANTHA LAKSHMI (New Name),** W/o. DONTHAMSETTI SRINIVAS GANESH. Here after, my name is known as **DONTHAMSETTI ANANTHA LAKSHMI (New Name),** W/o. DONTHAMSETTI SRINIVAS GANESH.

# టిడ్కో ఇళ్ల పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వండి

విశాలాంధ్ర-విజయవాడ(తిరువూరు) : తిరువూరు మండలంలో ఉన్న టిట్కో ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి లబ్దిదారులకు అందజేయాలని కోరుతూ సీపీఐ తిరువూరు నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే రక్షణ నిధికి బుధవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం సీపీఐ నాయకులు మాట్లాడుతూ సొంత గృహాలు లేక అద్దె ఇళ్లల్లో భారంగా జీవిస్తున్న నిరుపేదలు, అనేక పోరాటాల ఫలితంగా దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పేదలకు ఇండ్ల స్థలాలు పంపిణీ చేశారని చెప్పారు. గత ప్రభుత్వం సదరు స్థలాలలో నిరుపేదలు సొంతంగా ఇల్లు నిర్మించుకోలేరనే ఉద్దేశంతో ఎక్కువ మందికి గృహ వసతి కల్పించాలనే సంకల్పంతో టిట్కో గృహ సముదాయాలు నిర్మిస్తామన్నారని తెలిపారు. ఇండ్ల స్థలాల పట్టాలు వెనుకకు తీసుకొని టిట్కో గృహ సముదాయ పట్టాలిస్తామని చెప్పటం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో టిట్కో గృహ పథకం కింద 70 శాతం గృహ నిర్మాణాలు జరిగాయన్నారు. నిర్మాణం పూర్తికాకముందు ఎన్నికల రావటంతో ఆగిపోయిన గృహ నిర్మాణాలు ఇప్పటికి నాలుగున్నర సంవత్సరాలు గడుస్తున్నా ప్రస్తుత ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకుండా ఆగిపోయిన గృహ నిర్మాణాలను పూర్తి చేయకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. పట్టణంలో ఉన్న వాళ్ళకి రెండు సెంట్లు స్థలాన్ని ఇవ్వాలని, గ్రామాల్లో ఉన్న వాళ్ళకి మూడు సెంట్లు స్థలాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలు ఇండ్లకు డిపాజిట్లు కట్టి ఇళ్లు పూర్తి గాక అద్దె ఇంట్లో ఉంటూ అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పదవీకాలం పూర్తికా వస్తున్న నేపథ్యంలో ఇప్పటికైనా టిడ్కో ఇళ్లను పూర్తి చేసి పేదలకు అప్పగించాలని, జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలని కోరారు. పేద ప్రజలకు సకా లంలో పూర్తి చేసి ఇవ్వకపోతే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ప్రభు త్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో సీపీఐ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి ఎస్కే నాగుల్ మీరా, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు చిలుకూరు వెంకటేశ్వర రావు సీపీఐ తిరువూరు పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయ్, ఏఐటీ యూసీ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి ఎస్కే మీరా (కార్పెంటర్) ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు ఎస్కే సుభాని, బత్తుల వెంకటేష్ పాల్గొన్నారు.

## శ్రీ అన్నపూర్ణాదేవిగా ...

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): దసరా శరన్నవరాత్రుల సందర్భంగా స్థానిక చిట్టి నగర్ లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు దసరా ఉత్సవాల నాలుగవ రోజైన బుధవారం శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఏపీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం పాలకవర్గం పూర్ణకుంభంతో స్వాగతం పలికి పట్టు వస్త్రాలతో సత్కరించారు. అలాగే వైసిపి రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ , ఏషియన్ గేమ్స్ లో ఆర్చరీలో బంగారు పతకం సాధించిన క్రీడాకారిణి జ్యోతి సురేఖ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారిని విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి దర్శించుకుని పట్టు చీరను అందజేశారు. వీరిని ఆలయ పాల వర్గం సముచిత రీతిన సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం కమిటీ అధ్యక్షులు లింగిపిల్లి అప్పారావు,కార్యదర్శి మరు పిళ్ళ హనుమంతరావు, కోశాధికారి పిళ్ళా శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులు బెవర సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రతి రోజూ వేలాదిమంది భక్తులు ఉదయం, సాయంత్రం వేళల్లో అమ్మవారిని దర్శించుకుంటున్నారని చెప్పారు. స్వదేశీయ కళలు అంతరించిపోతున్న ప్రస్తుత తరుణంలో కళాకారులను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో దేవస్థానం ప్రాంగణంలో కళావేదికను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నిత్యం సాయంత్రం వేళల్లో జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాలకు భక్తుల నుండి చక్కటి ఆదరణ లభిస్తోందని చెప్పారు. దసరా ఉత్సవాల కార్యక్రమంలో దేవస్థానం పాలక మండలి సహాయ కార్యదర్శి పొట్నూరి దుర్గాప్రసాద్ , ఆర్గనైజింగ్ సెక్రటరీ కొరగంజి భాస్కరరావు ,కార్యవర్గ సభ్యులు పోతిన బేసికంటేశ్వరుడు, మజ్జి ఈశ్వరరావు, తమ్మిన సూర్యకుమారి, మజ్జి శ్రీనివాసరావు, కామందుల నరసింహారావు , భోగవల్లి శ్రీధర్ ,పోతిన వెంకట ధర్మారావు, బంక హనుమంతరావు, బెవరసాయి సుధాకర్, పణుకు రమ, పిళ్ళా విజయ్ కుమార్ పాల్గొన్నారు.

## 28, 29 శ్రీశైలం ప్రాజెక్ట్, ఉన్నత పాఠశాల, ఆసుపత్రి వజ్రోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడీ అయిన శ్రీశైలం ప్రాజెక్ట్, ఉన్నత పాఠశాల ,ఆసుపత్రి కట్టి 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈనెల 28,29 తేదీలలో వజ్రోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నాం అని శ్రీశైలం ప్రాజెక్ట్ పూర్వ విద్యార్థులు తెలిపారు.బుధవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పి.మల్లికార్జునరావు మాట్లాడుతూ ఈ వేడుకలలో శ్రీశైలం ప్రాజెక్టులో గతంలో పనిచేసి పదవి విరమణ చేసిన వారిని సత్కరించటం జరుగుతుందన్నారు.పూర్వ విద్యార్థులమంతా కలిసి పాఠశాలలో మౌలిక వసతులు మెరుగు పరిచామన్నారు. 2012లో జరిగిన స్వర్ణోత్సవాల సమయంలో పూర్వ విద్యార్థులతో పాఠశాల ,ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేసాము.రాష్టానికి జీవనాడీ అయిన శ్రీశైలం ప్రాజెక్ట్ లో ఎంతో మంది పని చేశారన్నారు.మాతో కలిసి చదువుకున్న వారి తల్లిదండ్రులు కుడా అనాడు ప్రాజెక్టు నిర్మాణంలో ఎంతో మంది పనిచేశారన్నారు.పూర్వ విద్యార్థులు ప్రాజెక్టులో పని చేసిన వారు ఇతర ప్రాంతాలలో ఉన్న వారు తప్పనిసరిగా రావాలని హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, వెంకటేశ్వర్లు, కెవిఎస్ఎమ్ ప్రసాద్, హరనాథ్,తదితరులు పాల్గొన్నారు.

**టాటా కేపిటల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్**

TATA

రిజిస్టర్డ్‌ఆఫీస్ : 11వ అంతస్తు, టవర్-ఎ, పెనిన్సులా బిజినెస్ పార్క్, గనపాత్రో కదమ్ మార్గ్, లోయర్ పరెల్, ముంబై-400013. బ్రాంచ్ చిరునామా: 3వ అంతస్తు, పున్నయ్య & వజ్రమ్మ కాంప్లెక్స్, డి.నం:59-6-17, కంచుకోటవారి వీధి, రామచంద్రనగర్, విజయవాడ-520008

**సవరణ**

ఈ దినపత్రికలో తేదీ: 14-10-2023న రుణగ్రహీత ఎం/ఎస్ పిఎస్‌బి అండ్ అసోసియేట్స్ (లోన్ ఎకౌంట్ నెం:TCFLA0454000011131536 ) యొక్క స్థిర ఆస్తి యొక్క విక్రయం కోసం ప్రచురించబడిన ప్రకటనకు సంబంధించి సూచన. నోటీసులో స్వాధీనత టైపును దయచేసి భౌతికం బదులుగా నిర్మాణాత్మకం అని చదువుకొనగలరని ఇందుమూలంగా తెలియజేయడమైనది. విక్రయ నోటీసులోని ఇతర అంశాల్లో ఎటువంటి మార్పులేదు.

సం/- అధీకృత అధికారి
టాటా కేపిటల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

## విశ్వరూప మహా పాదయాత్రకు సంఘీభావ యాత్ర

విశాలాంధ్ర-వీరులపాడు: అలంపూర్ టు హైదరాబాద్ వరకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ చేపట్టినటువంటి మాదిగల విశ్వరూప మహా పాద యాత్రకు సంఘీభావంగా నందిగామ నియోజకవర్గంలో ఏడవ రోజు జుజ్జూరు గ్రామం నుంచి ప్రారంభించారు. ఎమ్మార్పీఎస్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు యంద్రాతి కోటేశ్వర రావు, ఎమ్మార్పీఎస్ నందిగామ నియోజకవర్గ కన్వీనర్ యద్దనపూడి ఏడుకొండలు ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహిస్తున్నారు. ఏడవ రోజు నిర్వహిస్తున్న ఈ సంఘీభావ పాదయాత్ర ను జుజ్జూరు గ్రామంలో నిర్వహించారు. ఈ పాదయాత్రను జుజ్జూరు నుండి వీరులుపాడు వరకు నిర్వ హించారు. నందిగామ నియోజకవర్గ కన్వీనర్ మార్కపూడి రామారావు, ఎమ్మార్పీఎస్ నందిగామ నియోజకవర్గ కో కన్వీనర్ మంగళపూడి నిఖిల్ , వీరులపాడు మండల కో కన్వీనర్ చింతపల్లి చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ పార్టీలు సహకరించాలి

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ఈవీఎంలు వివిప్యాట్స్ ఫస్ట్ లెవల్ తనిఖీ ప్రక్రియకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు కోరారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి వారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించే ఈవీఎంలు వివిప్యాట్స్ ఫస్ట్ లెవల్ తనిఖీ ప్రక్రియలో భాగంగా కలెక్టర్ బుధవారం గొల్లపూడి మార్కెట్ యార్డ్‌లోని ఈవీఎం గోడౌన్ వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ నుండి ఈవీఎంలు, వీవీ ప్యాట్స్ ఫస్ట్ లెవెల్ చెకింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 16వ తేదీన ప్రారంభమైన ఫస్ట్ లెవెల్ చెకింగ్‌లో 125 బ్యాలెట్ యూనిట్లు, 125 కంట్రోల్ యూనిట్లు, 125 వీవీ ప్యాట్స్, 17న 265 బ్యాలెట్ యూనిట్లు, 265 కంట్రోల్ యూనిట్లు, 265 వీవీ ప్యాట్స్ చెకింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించామన్నారు. 25 రోజుల పాటు నిర్వహించే ఈ తనిఖీ కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రతిరోజు పాల్గొని ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. ఫస్ట్ లెవెల్ చెకింగ్‌కు సంబంధించిన ఎక్సెల్ షీట్ల సమాచారాన్ని ప్రతిరోజు అందించడం జరుగుతుందన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 16వ తేదీ నుండి ప్రారంభమైన ఫస్ట్ లెవెల్ చెకింగ్ ప్రక్రియ నవంబర్ 10వ తేది వరకు ఎలాంటి లోటు పాట్లు లేకుండా పక్కాగా నిర్వహిస్తామన్నారు. ఈతనిఖీ ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు నిర్వహిస్తున్నామని, మొబైల్ ఫోన్లు, కెమెరాలు, స్పై కెమెరాలు లాంటివి అనుమతించకుండా 20 రోజుల పాటు 5,700 ఈవీఎం ఫస్ట్ లెవెల్ చెకింగ్ పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈవీఎం గోడౌన్లలో నిర్వహించే ఫస్ట్ లెవెల్ చెకింగ్ ప్రక్రియకు కట్టుదిట్టమైన బ్యారికేడింగ్ నిర్వహించి పటిష్ట బందోబస్తుతో పాటు సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రక్రియను వెబ్ క్యాస్టింగ్ నిర్వహిస్తున్నామన్నారు. విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా ఏర్పాటు చేసి ఈ ప్రక్రియను ప్రత్యేక మానిటర్ల ద్వారా పరిశీలించేందుకు ఏర్పాటు చేసిన్నట్లు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఈ సమావేశంలో డీఆర్వో నాగేశ్వరరావు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

## ‘జగనన్న ఆరోగ్య సురక్ష’

విశాలాంధ్ర-కంచికచర్ల: పేరకలపాడులో జగనన్న సురక్ష కేంద్రాలను డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. సురక్ష శిబిరాలకు అనూహ్య స్పందన లభించడంతో వైద్య శిబిరాలను మరింత విస్తృతం చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అందరికీ సంపూర్ణారోగ్యం సురక్ష లక్ష్యం

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్ : ప్రతి ఒక్కరికీ సంపూర్ణారోగ్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తిరువూరు శాసనసభ్యుడు కె.రక్షణనిధి అన్నారు. మండలంలోని వేమిరెడ్డిపల్లి పంచాయతీలో ఏర్పాటు చేసిన సురక్ష కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమం అమలు తీరును ఆయన వివరించారు. సర్పంచి పంతంగి విజయకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు జడ్పీటీసీ సభ్యుడు బీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, డీసీసీబీ సభ్యురాలు భూక్యా రాణి, ఎంపీపీ పి.మెర్సీ వనజాక్షి, ఎంపీటీసీ సత్యనారాయణాచారి, ఎంపీడీవో ఎస్.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## రూ.4 లక్షలతో రోడ్డు పనులు

విశాలాంధ్ర- నందిగామ: మండలపరిషత్ అభివృద్ధి నిధులతో మాగల్లు గ్రామం లో నాలుగు లక్షల రూపాయలతో గోపు వాని డొంక రోడ్డు కు మట్టిపనులు మరియు కంపచెట్లు తొలిగింపు పనులను ప్రారంభించిన కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ శ్రీ కొమ్మినేని రవిశంకర్ , ఈ కార్యక్రమం లో ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుంటి ఆశాజ్యోతి, ఎంపీటీసీ కొమ్మినేని శోభారాణి,ఐ డి సి సి చైర్మన్ లు చింతల వెంకటేశ్వరరావు ,తమ్మిశెట్టి శ్రీనివాసరావు , గ్రామ నాయకులు గుంటి చిన్ని , పెద్ద సత్యం గారు , ఆవుల నాగేశ్వరావు మరియు రైతు సోదరులు పాల్గొన్నారు.

**ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్**

muthoot HOUSING FINANCE

రిజిస్టర్డ్ ఆఫీస్ : టిసి నం.14/2074-7, ముత్తూట్ సెంటర్, పున్నెన్‌రోడ్, తిరువనంతపురం-695 034, సిఐఎన్ నం : యు65922కెఎల్2010పిఎల్‌సి025624 కార్పొరేట్ ఆఫీస్ : 12ఏ 01, 13వ అంతస్తు, పరిణీ క్రెసెంజో, ప్లాట్ నం.సి38 & సి39, బంద్రా కుర్లా కాంప్లెక్స్-జి బ్లాక్ (ఈస్ట్), ముంబై-400051, టెలి నం : 022-62728517, అధీకృత అధికారి Email Id: authorised.officer@muthoot.com, సంప్రదించు వ్యక్తి - ఓంకారేష్ బి - 9902067892

**బహిరంగ నోటీసు - ఆస్తి యొక్క వేలం కమ్ విక్రయం**

సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 కింద స్థిర ఆస్తుల యొక్క విక్రయం సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని అధికారాలను ఉపయోగించి ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ (ఇకమీదట 'కంపెనీ'గా చదుకొనునది) యొక్క అధీకృత అధికారి ఈ కింద పేర్కొన్న కస్టమర్ల (ఇకమీదట 'రుణగ్రహీతలు'గా చదుకొనువారు) కు మంజూరు చేసిన హౌసింగ్ రుణ సౌకర్యాలకు సంబంధించి హామీగా పెట్టిన ఈ కింద పేర్కొన్న ఆస్తులను (ఇకమీదట హామీగా పెట్టిన ఆస్తులుగా చదివేది) స్వాధీనం చేసుకోవడమైనది మరియు ఈ కింద పేర్కొన్నట్లుగా రుణగ్రహీతల నుంచి మీరిన బకాయిల చివరి చెల్లింపు జరిగేవరకు భవిష్యత్తు వడ్డీ మరియు దానిపై ఖర్చులతో రావల్సిన మొత్తం బకాయిలకు సంబంధించి ప్రజల నుంచి సీలు వేసిన టెండర్లను ఆహ్వానించడం ద్వారా "ఎక్కడ ఉన్నది అలాగే", "ఉన్నది ఉన్నట్లు", "అక్కడ ఉన్నది ఏదైనా" మరియు "రికోర్స్ లేకుండా" ప్రాతిపదిక/షరతులపై హామీగా పెట్టిన ఆస్తిని విక్రయించేందుకు నిర్ణయించడమైనది.

| క్ర. సం. | రుణగ్రహీత/లు పేరు & రుణఖాతా సంఖ్య | స్వాధీన టైప్ & తేదీ | మొత్తం బకాయి (రూ.లు) & వర్తించే భవిష్యత్తు వడ్డీ | రిజర్వ్ ధర (రూ.) | ఇఎండి ధర (రూ.) |
|---|---|---|---|---|---|
| 1. | రుణఖాతా సంఖ్య 11204121962 1. జేష్ఠ ఆంజనేయులు ప్రసాద్ 2. అనూష జేష్ఠ | లాంఛనప్రాయ స్వాధీనత 09-జనవరి-2023 | 18-అక్టోబరు-2023 నాటికి రూ.17,61,139.05/- | 12,75,000/- | 1,27,500/- |
| | హామీగా పెట్టిన ఆస్తి(లు)/స్థిర ఆస్తి(లు) వివరాలు: ఆంధ్రప్రదేశ్- 522601, గుంటూరు జిల్లా, నర్సరావుపేట మండలం, పెట్లూరి వారి పాలెం గ్రామం& పంచాయతీ పట్టా నం.1162, కొత్త సర్వే డి.నం. 162-1బి, డోర్ నెం. 2-200/ఏ నందు గల ఆస్తి మొత్తంగా. విభజన దస్తావేజు నం: 18055/2020 ప్రకారం ఆస్తి సరిహద్దులు: అంశం-1: తూర్పు: - చెరువు కట్ట, దక్షిణం:- కోటప్పకొండ రోడ్, పశ్చిమం:- పంచాయతీ బజార్, ఉత్తరం:- అంశం-2, భూమి విస్తీర్ణం: 197-91 చదరపు గజాలు, అంశం-2: తూర్పు: - చెరువు కట్ట, దక్షిణం: - అంశం-1, పశ్చిమం: - పంచాయతీ బజార్, ఉత్తరం: - కాలశేటి పావుల్స్ ఆస్తి, భూమి విస్తీర్ణం: 121 చదరపు గజాలు, మొత్తం విస్తీర్ణం: 318.91 చదరపు గజాలు | | | | |
| 2. | రుణఖాతా సంఖ్య: MHFLPROVIJ00000500267 7 1.దాగంటిపాటి అనిల్‌కుమార్ 2.దాగంటిపాటి లక్ష్మి | లాంఛనప్రాయ స్వాధీనత 21-ఆగస్టు-2023 | 18-అక్టోబరు-2023 నాటికి రూ.6,26,947.30/- | 8,50,000/- | 85,000/- |

హామీగా పెట్టిన ఆస్తి(లు)/స్థిర ఆస్తి(లు) వివరాలు: పటమట ఎస్ఆర్ఓ పరిధిలో కృష్ణాజిల్లా, విజయవాడ రూరల్ మండలం, యనమలకుదురు గ్రామం మరియు గ్రామ పంచాయతీ, బ్లాక్ నం.12, ఆర్.ఎస్.నం.2/1లో 335 చదరపు అడుగుల నిర్మిత ప్రదేశం (ఉమ్మడి ప్రదేశం మరియు పార్కింగ్ ఏరియాతో కలిసి) కలిగియున్న డి.నం.19-116, 1వ అంతస్తు ఉత్తరభాగం, ఫ్లాట్ నం.2తో పాటు 205.64 చదరపు గజాల మొత్తం భూమి నుంచి 34.45 చదరపు గజాలు లేదా 28.803 చదరపు మీటర్ల విస్తీర్ణపు అవిభాజ్య వాటా నుంచి 17.255 చదరపు గజాలు లేదా 14.401 చదరపు మీటర్ల అవిభాజ్య మరియు అనిర్దిష్ట భూమివాటా కలిగిన ఆస్తి మొత్తంగా. భూమి హద్దులు: తూర్పు: లంకె వెంకటరావు ఆస్తి, దక్షిణం: లంకె వెంకటరావు ఆస్తి, పడమర: సైదిపాముల లక్ష్మీకుమారి ఆస్తి, ఉత్తరం: 15 అడుగుల వెడల్పు రోడ్డు. ఫ్లాట్ హద్దులు: తూర్పు: ఉమ్మడి కారిడార్, దక్షిణం: విక్రయదారు ఆస్తి, పడమర: ఓపెన్ టు స్కై, ఉత్తరం : ఓపెన్ టు స్కై మరియు స్టెయిర్ కేస్.

తనిఖీ తేదీ తేదీ & సమయం: 06-నవంబరు-2023 & 07-నవంబరు-2023 ఉదయం 10.00 నుండి సాయంత్రం 05.00 వరకు
వేలం తేదీ: 22-నవంబరు-2023 ఉ.10.00 నుంచి మ.03.00 & బిడ్‌ను సమర్పించడానికి చివరి తేదీ: 21-నవంబరు-2023
విక్రయం జరుగు ప్రదేశం: విజయవాడ బ్రాంచ్: శ్రీ నివాస్, డి.నం. 57-2-15, కిలారువారి వీధి, పంటకాలువ రోడ్డు, పటమట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520010

[illegible]

ప్రదేశం: ఆంధ్రప్రదేశ్, తేదీ: 19-అక్టోబరు-2023 సం/- అధీకృత అధికారి, ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ తరఫున

## టెనెలిగ్లిప్టిన్, డపగ్లిఫ్లోజిన్, మెట్‌ఫార్మిన్ మూడు ఔషధాల ఎఫ్ డీసీని తొలిసారిగా ఆవిష్కరించనున్న గ్లెన్మార్క్

**విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట :** పరిశోధనల ఆధారిత అంతర్జాతీయ ఔషధ తయారీ సంస్థ అయిన గ్లెన్మార్క్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ (గ్లెన్మార్క్ ఫార్మా) భారతదేశంలో తొలిసారిగా మూడు ఔషధాల ఫిక్స్ డోస్ కాంబినేషన్ (ఎఫ్‌డీసీ)ని ఆవిష్కరించినట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో టెనెలిగ్లిప్టిన్, డపగ్లిజిన్, మెటా ఫార్మిన్ అనే మూడు మందులు కలిసి ఉంటాయన్నారు. ఈ ఎఫ్ డీసీని జిటాఫై డీఎం అనే బ్రాండ్ పేరుతో ఆవిష్కరించారన్నారు. ఈ సందర్భంగా గ్లెన్మార్క్ ఫార్మా ఇండియా ఫార్ములేషన్స్ ప్రెసిడెంట్, బిజినెస్ హెడ్ అలోక్ మాలిక్ మాట్లాడుతూ, అధిక హెచ్చిఎ 1 సి ఇతర సహ-అనారోగ్యాలు ఉన్న వయోజన రోగులలో నియంత్రణను మెరుగుపరచడంలో సహాయపడే సరికొత్త మరియు సరసమైన యాంటీ డయాబెటిక్ డ్రగ్ జిటా గ్లైసెమిక్ డిఎమ్ను పరిచయం చేయడం మాకు గర్వంగా ఉందన్నారు. అదే సమయంలో ప్రధాన మూత్రపిండాలు మరియు గుండె ప్రతికూల సంఘటనలను కూడా తగ్గిస్తుంది. ఈ బలమైన ప్రొఫైల్తో, దీర్ఘకాలిక డయాబెటిస్ చికిత్సలకు రోగి కట్టుబడి ఉండటానికి జిటా డిఎం సహాయపడుతుందని మేము సానుకూలంగా ఉన్నామనీ వివరించారు.

## బాల్య వివాహాల రహిత ఆంధ్రప్రదేశ్ అవగాహన ఉద్యమం

**విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట :** ప్రభుత్వ ఆదేశాలు ననుసరించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బాల్య వివాహాలను రూపుమాపుటకు రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక ప్రయోజనాల కొరకు సంఘీభావం ప్రకటిస్తూ పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా, ఈ వారం ఆరంభలో ప్రభుత్వ వివిధ శాఖలు తమ అధికారులకు పూర్తి స్థాయిలో పాల్గొనవలసినదిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ను బాల్య వివాహ రహిత రాష్ట్రంగా మార్చు కార్యక్రమాలు చేపట్టవలసిందిగా లేఖలు రాశారు. 2030 నాటికి భారత దేశంలో బాల్య వివాహాలు నిర్మూలనకు "బాల్య వివాహ రహిత భారతదేశం" ప్రచార కార్యక్రమం దేశంలోని 300 పైగా జిల్లాలలో మహిళా కార్యకర్తలు 160 పౌర సంఘాలు సంస్థలు వారి ఆధ్వర్యంలో నిర్వహించారు.ప్రస్తుత పరిస్థితి ఇలాగే కొనసాగితే, 2050 నాటికి భారతదేశంలో లక్షలాది మంది బాలికలు బాల్య వివాహాలకు బలవుతారని యునిసెఫ్ అంచనాలు చెపుతున్నాయన్నారు. ఈ ప్రచారం సందర్భంగా రవికాంత్, కంట్రీ హెడ్, కైలాష్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ మాట్లాడుతూ, బాల్య వివాహ రహిత ప్రచారానికి వచ్చిన విశేష స్పందనకు తన సంతోషాన్ని వ్యక్తపరిచారు. బాల్య వివాహాలు అనేవి యుగయుగాలుగా మన సమాజంలో పెనవేసుకుని ఉన్నాయని, ఇది నేరం అయినప్పటికీ, వీటిని నివారించుట జరగలేదన్నారు. ప్రస్తుతం చేపట్టిన ఈ ప్రచార ఉద్యమానికి అన్ని వర్గాల నుంచి లభించిన అపారమైన స్పందన చూస్తుంటే భారత దేశం బాల్య వివాహ రహిత దేశంగా చరిత్ర సృష్టిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న చొరవతో మన బాలలు వారి హక్కులకు హామీనిచ్చి వాటిని కాపాడే దేశంలో సురక్షితంగా పెరుగుతారనీ వివారించారు.

## జీ తెలుగులో దసరా సంబరాలు

**విశాలాంధ్ర విజయవాడ లబ్బీపేట :** దేవీ నవరాత్రులు సందర్భంగా ఈ దసరా పండుగని కూడా మరింత సంబరంగా మార్చేందుకు ప్రముఖ నటీనటులతో సంప్రదాయం, సంస్కృతి ఉట్టిపడేలా ఈ దసరా పండుగకి 'దసరా కలిసుందాం రా' అనే ప్రత్యే కార్యక్రమంతో ప్రేక్షకుల అందిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. వినోదం నిండిన 'దసరా కలిసుందాం రా' అక్టోబర్ 22 వ తేది సాయంత్రం 6 గంటలకు జీ తెలుగు ప్రేక్షకులకు వినోదాన్ని పంచుతుందన్నారు. జీ తెలుగు వేదికగా వెండితెర, బుల్లితెర ప్రముఖ నటీనటులంతా ఒకేచోట చేరి జరుపుకున్న ఈ ఉత్సవం విజయానికి ప్రతీక అయిన విజయదశమి మరింత ప్రత్యేకంగా మారుస్తుందన్నారు. మాస్ మహారాజ రవితేజ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై నటీనటులతోరవితేజ సరదా సంభాషణలు ఆద్యంతం అలరిస్తాయన్నారు. అందాల తారలు జయప్రద, రాశి, సంఘవి, ప్రేమ, యమున, ఆమనివంటి ప్రముఖ నటీమణులు కూడా హాజరై ప్రేక్షకులకు వినోదం ఫంక్షన్ పంచనున్నారన్నారు.

## దేవీ నవరాత్రుల్లో మ్యాక్సీవిజన్ ఐ హాస్పిటల్ ఉచిత ఐస్క్రీనింగ్ క్యాంప్

**విశాలాంధ్ర-విజయవాడ ఎడ్యుకేషన్:** దేవి నవరాత్రుల్లో భాగంగా అమ్మవారి దర్శనం కోసం వస్తున్న వేలాదిమంది భక్తుల సౌకర్యార్థం మ్యాక్సీవిజన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత ఐస్క్రీం క్యాంప్ ను నిర్వహిస్తున్నట్లు సంస్థ జనరల్ మేనేజర్ ఎం ప్రదీప్ కుమార్ తెలిపారు. ఈ క్యాంపులో కంటికి సంబంధించిన టెస్టులని ఉచితంగా చేస్తున్నామని, అవసరమైన వారికి మందులు ఇవ్వటంతో పాటు తగు వైద్య సలహాలను సూచిస్తున్నామన్నారు. భక్తులకు కంటి పరీక్షలు చేసి, వాటర్ ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లను సైతం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ జీఎం ప్రదీప్ కుమర్, మార్కెటింగ్ మేనేజ భీమయ్య, నారాయణ, గౌస్ క్యాంపు టీమ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## 20, 21వ తేదీల్లో కేఎల్‌యూలో జాతీయస్థాయి సాంకేతిక సదస్సు

**విశాలాంధ్ర - విజయవాడ ఎడ్యుకేషన్ :** విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించే లక్ష్యంతో కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ప్రతి ఏటా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవం సమ్యక్ ను ఈ నెల 20,21 తేదీలలో వడ్డేశ్వరం లోని గ్రీన్ ఫీల్డ్ క్యాంపస్ లో నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ అన్నారు. విజయవాడ లోని పరిపాలన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సాంకేతిక సదస్సుకు దేశవ్యాప్తంగా ఆయా కళాశాలలు, యూనివర్సిటీ లకు చెందిన సుమారు 15వేల మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. రెండు రోజులు జరిగే ఈ సాంకేతిక సదస్సులో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, సదస్సులతో పాటు విద్యార్థుల ప్రదర్శనలతో సాంకేతిక పండుగలా జరుగుతుందన్నారు. విద్యార్థుల నాయకత్వాన్ని కనబరిచేలా విద్యార్థులే కమిటీలుగా ఏర్పడి సమ్యక్ అనే సాంకేతిక సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల సాంకేతిక సామర్థ్యాలను బలోపేతం చేసే అనేక ఈవెంట్ల ద్వారా ప్రత్యేకమైన అనుభవాన్ని అందించే విషయంలో సమ్యక్ అత్యంత ప్రభావం చూపుతుందన్నారు. సమ్యక్ నిర్వహిస్తున్న కెఎల్ యు విద్యార్థుల కమిటీ సభ్యులు వినయ్ మాట్లాడుతూ ప్రాంతాలు, విశ్వవిద్యాలయాలు, కళాశాలలు అనే తారతమ్యం లేకుండా దేశ వ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ విద్యార్థులందరూ ఒకే వేదిక మీద జరుపుకునే సాంకేతిక పండుగ సమ్యక్ అని వివరించారు. ఆన్ లైన్ ద్వారా ఇప్పటికే దేశవ్యాప్తంగా15 వేల మంది విద్యార్థులు తమ పేరులను నమోదు చేసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం లో విసి డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో విసిలు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు , చరిష్మ, ఆస్రిత తదితరులు పాల్గొన్నారు.

## రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి

**విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) :** మహిళలను మాత్రమే ఇబ్బంది పెట్టే రొమ్ము క్యాన్సర్‌పై దేశంలో అవగాహన చాలా తక్కువగా ఉండటం వలన ఎక్కువ మంది చనిపోతున్నారని దానిపై అవగాహన ఉండి అపోహలు విడనాడి ముందుగానే గుర్తించి చికిత్స అందిస్తే ఎటువంటి ప్రమాదం ఉండదని రైల్వే ఆసుపత్రి చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. సారిబాల,అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్ కన్సల్టెంట్ అంకాలజిస్ట్ డాక్టర్ అనిలా పాటిబండ్ల సూచించారు. రైల్వే హాస్పిటల్ బుధవారం "రొమ్ము క్యాన్సర్" పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రత్యేక అతిథిగా విచ్చేసిన డాక్టర్ అనిలా పాటిబండ్ల ముందుగా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా రోగులకు రొమ్ము క్యాన్సర్ రావటానికి కారణాలు, లక్షణాలు, ముందస్తు గుర్తింపుపై అవగాహన కల్పించారు. రొమ్ము క్యాన్సర్ కేసులలో వివిధ చికిత్సల గురించి కూడా ఆయన వివరించారు.రొమ్ము క్యాన్సర్‌కు కణితి ఉంటుంది అయితే రొమ్ములో ఏర్పడే ప్రతి కణితి క్యాన్సర్ కాదు ఎందుకుంటే చాలా సందర్భాల్లో క్యాన్సర్ గుర్తించలేరు.రొమ్ము క్యాన్సర్ ప్రారంభ దశలో కణితులుగా అభివృద్ధి చెందదు అన్నారు. వారసత్వంగా వచ్చే వారు మాత్రం జాగ్రత్తలు పాటిస్తే వ్యాధిని నివారించవచ్చు అన్నారు. అయితే రొమ్ము ఇంప్లాంట్లు చేయించుకున్న మహిళలకు ప్రమాదం ఎక్కువ వాటి విషయాల్లో జాగ్రత్త వహిస్తే మంచిదన్నారు.ఈ కార్యక్రమంలోఎసిఎమ్ఎస్ డాక్టర్.ఎం.జైదీప్,గైనకాలజిస్ట్ డాక్టర్ శారద, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

# మతిలేని మాటలు చెప్తున్న ఉపముఖ్యమంత్రి : సౌమ్య

**విశాలాంధ్ర-నందిగామ:** ఉప ముఖ్యమంత్రి స్థానంలో ఉండి కొట్టు నారాయణస్వామి బుద్ధి, జ్ఞానం లేకుండా మతిలేని మాటలు మాట్లాడుతున్నారని మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. నందిగామ పట్టణం కాకాని నగర్ నందు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో బుధవారం మాజీ శాసనసభ్యురాలు శ్రీమతి తంగిరాల సౌమ్య మాట్లాడుతూ నాడు ఉపముఖ్యమంత్రిగా ఉన్న నారాయణస్వామి నారా చంద్రబాబునాయుడు పై ఆయన సతీమణి భువనేశ్వరి పై చేసిన అనుచిత,అసత్య వ్యాఖ్యలను ఖండిస్తూ వారి కార్యాలయంలో ఒక ప్రకటనలో మాట్లాడుతూ స్వర్గీయ ఎన్టీఆర్ ఎప్పుడు చనిపోయారో, చంద్రబాబునాయుడు-భువనేశ్వరి వివాహం ఎప్పుడు జరిగిందో తెలియకుండానే నారాయణస్వామి మతిలేకుండా ?రాజకీయాల్లో నారాయణస్వామి ఎప్పటినుంచి ఉన్నారు.స్వర్గీయ ఎన్టీఆర్ కుటుంబం, చంద్రబాబు నాయుడు ఎప్పటి నుంచి ఉన్నారు. తండ్రిని చంపిన వ్యక్తినే భువనేశ్వరి పెళ్లి చేసుకుంది అని నారాయణస్వామి ఎలా మాట్లాడుతారు.ఎన్టీఆర్ మరణించింది 1996లో అయితే, చంద్రబాబు నాయుడు, భువనేశ్వరి వివాహం జరిగింది 1981లో ఇంత చిన్న విషయం కూడా తెలియకుండానే నారాయణ స్వామి మతిలేకుండా మాట్లాడారా? చంద్రబాబు సతీమణి శ్రీమతి భువనేశ్వరి ని కలవడానికి వెళ్లేవారిపై ఈ ప్రభుత్వం ఎందుకు అంత కర్కశంగా వ్యవహరిస్తోంది.ఒకవైపు చంద్రబాబు నాయుడి గురించి ఎవరూ ఆలోచించడం లేదంటారు.మరోపక్క ఆయనకు మద్దతుగా బయటకు వచ్చేవారిని పోలీసుల సాయంతో అడ్డుకుంటారు. ఇదేనా మీ పాలన చంద్రబాబునాయుడు కి మద్దతుగా భువనేశ్వరి, బ్రాహ్మణి చేపట్టిన నిరసన కార్యక్రమాలన్నీ విజయవంతం కావడంతో పాలకుల్లో భయం మొదలైంది.చంద్రబాబునాయుడు త్వరగా బయటకు రావా లని, ఆరోగ్యంగా ఉండాలని ఎక్కడిక్కడ రాష్ట్రమంతటా ప్రజలు సర్వమత ప్రార్థనలు చేస్తున్నారు. చంద్రబాబునాయుడు ఎప్పటికైనా కడిగిన ముత్యంలా బయటకువస్తారు, కానీ రాష్ట్రంలో మానవత్వం రోజురోజుకీ మంటగలిసిపోతుంది.ఉప ముఖ్యమంత్రి స్థానంలో ఉండి నారాయణస్వామి బుద్ధి, జ్ఞానం లేకుండా మాట్లాడిన మాటలు తక్షమే ఉపసంహరించుకోవాలి.నారా చంద్రబాబునాయుడు కి ఆయన కుటుంబ సభ్యులకు నారాయణస్వామి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని హెచ్చరిస్తున్నాము.

## బాలికల డబుల్స్‌లోనూ తమిళనాడు హవా

**విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్:** విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలోని టెన్నిస్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న 18వ జాతీయస్థాయి జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో బాలికల డబుల్స్ విభాగంలోనూ తమిళనాడు క్రీడాకారులు తమ హవాను కొనసాగించారు. బుధవారం జరిగిన బాలికల డబుల్స్‌లో తమిళనాడు చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. తమిళనాడు బాలికల ద్వయం సాధన, నరుముగై 3-1 సెట్ల తేడాతో మహారాష్ట్రకు చెందిన ఆయుష, రితిక జంటపై విజయం సాధించారు. తొలుత రెండు జట్లు గెలుపు కోసం హోరా హోరీగా తలపడినప్పటికీ, చివరకు తమిళనాడు క్రీడాకారులనే విజయం వరించింది. అంతుముందు జరిగిన సెమీ ఫైనల్స్‌లో తమిళనాడుకు చెందిన సాధన, నరుముగై జంట, తమ రాష్ట్రానికే చెందిన ఎస్వి శమిత, యాజిని పై 3-0 సెట్లతో గెలుపొంది ఫైనల్స్‌కు చేరగా, మరో సెమీస్‌లో మహారాష్ట్రకు చెందిన ఆయుశ, రితిక ద్వయం, జమ్మూ కాశ్మీర్‌కు చెందిన సిదాని, శ్రీమాయ్‌పై 3-0తో గెలుపొంది ఫైనల్స్‌కు చేరారు. కాగా, నాలుగు రోజులుగా జరుగుతున్న సాఫ్ట్ టెన్నిస్ జాతీయస్థాయి పోటీలు గురువారంతో ముగియనున్నాయి. అనంతరం జరిగే కార్యక్రమంలో అతిథులు విజేతలకు బహుమతులను అందజేయనున్నారు.

## గజలక్ష్మీ దేవిగా అమ్మవారు

**విశాలాంధ్ర-అవనిగడ్డ :** లంకమ్మ అమ్మవారు, శ్రీ రాజరాజేశ్వరి అమ్మవార్లు గజలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. దేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నాల్గోవ రోజు అయిన బుధవారం రాజరాజేశ్వరి సహిత రాజశేఖర స్వామి వారి ఆలయంలో రాజేశ్వరి అమ్మవారు, గ్రామ దేవత లంకమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారు గజలక్ష్మీ దేవిగా దర్శనం ఇచ్చారు. మండల పరిధిలోని వేకనూరు, అంకాలమ్మ అమ్మవారు, మహాలక్ష్మీ అమ్మవారిగా, 9 వ వార్డులోని వీవర్స్ కాలనీ, 3 వ వార్డులోని కోదండ రామాలయం, ఆర్యవైశ్య కాలనీలో ఏర్పాటు చేసిన అమ్మవార్లు మహలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. రాజరాజేశ్వరి సహిత రాజశేఖర స్వామి వారి దేవస్థానంలో అమ్మవార్లకు ఉభయ దాతలు పూజలు, కుంకుమ అర్చనలు నిర్వహించగా, ఆలయ అర్చకులు ఘంటశాల సంతోష పవన్ కుమార్ శర్మ అమ్మవార్లకు వేదమంత్రోచ్ఛారణల నడుమ పూజలు నిర్వహించగా, ఆలయ అర్చకులు ఘంటశాల రాజశేఖర శర్మ (పసి), సత్యనారాయణ శర్మలు అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి గజలక్ష్మీ అమ్మవారిని దర్శించుకుని సామూహికంగా లలితసహస్రనామ పారయణం చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. లంకమ్మ అమ్మవారి ఆలయంలో విశేష పూజలు నిర్వహించగా, భక్తులకు కావలసిన ఏర్పాట్లను ఆలయ చైర్మన్ ధర్మకర్త అన్నపరెడ్డి రామదాసు భక్తులకు కావలసిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దేవిశరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కంచి కామక్షమ్మ అమ్మవారి ఆలయంలో యాగం నిర్వహించగా, భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా దివిసీమలో దేవాలయాలను కళ్ళు మిరమిట్లు గొలిపే విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించగా దేవాలయాలకు మహిళా భక్తుల తాకిడి ఎక్కువగా ఉంది.

## చంద్రబాబు అరెస్టు .. కక్షసాధింపు : బేగ్

**విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్):** టీడీపీ అధినేత చంద్రబాబు అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయడం ఏపీలో కక్ష సాధింపు రాజకీయాల పరాకాష్ట అని టీడీపీ మైనారిటీ నాయకులు ఎం.ఎస్ బేగ్ అన్నారు. బుధవారం అక్రమ అరెస్టు నిరసనగా ప్రజా చైతన్య యాత్ర జరిపారు. విజయవాడ కొత్తపేటలో ఇంటింటికి వెళ్లి చైతన్య యాత్ర చేశారు. అక్రమ అరెస్టును వివరిస్తూ, మ్యానిఫెస్టోలోని పథకాలను వివరించారు. 53వ డివిజన్ అధ్యక్షులు రావూరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి తిరువాయిపాటి మాధహసుధనరావు, క్లస్టర్ ఇంచార్జ్ బూర కనకరావు గార్ల ఆధ్వర్యంలో కోమల్ విలాస్ సెంటర్ నుండి చైతన్య యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం.ఎస్ బేగ్ మాట్లాడుతూ చంద్రబాబుని జైల్లో పెట్టి ప్రజల సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. కేసులో పస లేకపోయినా లాయర్లకు కోట్లు ఖర్చు పెట్టి వాదనలు వినిపిస్తున్నారన్నారు. ఇందుకు సీఎం జగన్ భారీ మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు. నోటికి వచ్చినట్టు మాట్లాడితే రాబోయే రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నగరాల సాధికారత సమితి కన్వీనర్ మరుపిళ్ళ తిరుమలేష్, డివిజన్ ఉపాధ్యక్షులు షేక్ తారిక్ అజీజ్, యూనిట్ ఇంచార్జ్ లు సయ్యద్ ఇమ్రాన్, తొత్తడి ఫణి తేజ్, బూత్ ఇంచార్జ్ లు కోవెలకర్ మహేష్, రామలక్ష్మి , పీసా చక్రపాణి, సింహాద్రి కళాధర్, లక్కోజు రాజు, అడ్డురి సూర్య ప్రకాష్, భక్తవత్సలమ్ హరిమాణిక్యం, జిల్లా కార్యాలయ కార్యదర్శి సారిపల్లి రాధాకృష్ణ, మహిళ అధ్యక్షురాలు సుఖాసి సరిత, ప్రధాన కార్యదర్శి నసీమ తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఎంసెట్ 3వ విడత కౌన్సెలింగ్ రద్దుచేసి విద్యార్థులకి తీరని ద్రోహం

**విశాలాంధ్ర-విజయవాడ :** రాష్ట్రంలో ఎంసెట్ 3వ విడత కౌన్సెలింగ్ నిర్వహణపై ప్రభుత్వ ఉదాసీన వైఖరిని నిరసిస్తూ జోన్-3 పరిధిలోని పార్లమెంట్ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు బుధవారం మంగళగిరిలోని ఉన్నత విద్యా మండలి చైర్మన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఎంసెట్ -3వ విడుత కౌన్సిలింగ్‌ను తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్ర రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజినీరింగ్ ప్రవేశాలకు సంబంధించి రాష్ట్రం నుంచి ఏటా లక్షలాది మంది ఎంసెట్ రాస్తుంటారని గుర్తు చేశారు. ఇప్పటి వరకు ప్రతి సంవత్సరం 3 విడతల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తుండగా ఈ ఏడాది అర్థాంతరంగా రెండు కౌన్సెలింగ్ లకే పరిమితం చేయడం బాధాకరమని దీని వెనుక ఆంతర్యం ఏంటో ప్రభుత్వం వేలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి బొత్స సత్యనారాయణ కౌన్సెలింగ్ డేట్ ఇస్తామని విద్యార్థులకి హామీ ఇచ్చి మోసగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఏడాది రెండు విడతలకే పరిమితం చేయడం స్పాట్ అడ్మిషన్లు అయితే ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లించక్కర్లేదని, కౌన్సెలింగ్ సీట్లయితే చెల్లించాల్సి వస్తుందనే కుతంత్రంతోనే ఏకంగా 3వ విడత కౌన్సెలింగ్ రద్దు చేయడం అన్యాయమన్నారు. స్పాట్ అడ్మిషన్లు, కన్వీనర్ కోటాలో సీఎస్ఈ సీట్లన్నీ అమ్ముకునేందుకు సర్కారు విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటోందని ఆరోపించారు. అక్రమ కేసులో తమను అరెస్టు చేసేందుకు పెట్టిన శ్రద్ధలో ఒకటో వంతు రాష్ట్ర సమస్యలపై పెట్టి ఉంటే వ్యవస్థలు ఇంత అస్తవ్యస్తంగా తయారయ్యేవి కావన్నారు. సీఎం వైఎస్ జగన్ ఇప్పటికైనా స్పందించి, వెంటనే ఎంసెట్ 3వ కౌన్సెలింగ్ తేదీలు ప్రకటించి, విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జోన్ -3 కి సంబంధించిన టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు ఎం.వంశీ కృష్ణ, కే. హనుమంత రావు, శరత్ బాబు, వినోద్ కుమార్, చరణ్ యాదవ్, జీవన్ కుమార్, విజయ్ కుమార్, రాష్ట్ర, పార్లమెంట్, అసెంబ్లీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆర్థిక చేయూత

**విశాలాంధ్ర-హనుమాన్ జంక్షన్ :** స్థానిక మానవతా స్వచ్ఛంద సేవ సంస్థ బుధవారం గోపన్నపాలెంలోని శ్రీ సీతారామ గవర్నమెంట్ కాలేజ్ చదువుతున్న విద్యార్థి శ్యామలా లక్ష్మీ ప్రసన్నకు ఫీజు నిమిత్తం ఐదు వేల రూపాయలు అందించటం జరిగింది. అదే కాలేజీకి చెందిన విద్యార్థి జొన్నాడ ధనలక్ష్మి అనే విద్యార్థినికి మానవత రాష్ట్ర కన్వీనర్ మారు బోయిన కోటేశ్వరరావు తన సొంత డబ్బులు 5000 రూపాయలు నగదు రూపంలో అందజేసినారు. ఈ కార్యక్రమానికి కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ నతానీయేల్‌తో ఆటు మనవతా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## దేవి శరన్నవరాత్రుల వేళ సెక్షన్ 144 ఎందుకు : పెందుర్తి

**విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్)** బెజవాడలో శరన్నవరాత్రులు జరుగుతున్న వేళ సెక్షన్ 144 ఎందుని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెందుర్తి శ్రీనివాస్ ఒక ప్రకటనలో ప్రశ్నించారు. దేశంలో ప్రఖ్యాత దేవాలయమైన కనకదుర్గమ్మ నగరంలో ధార్మిక సంఘాలు, భక్తి సంఘాలు అమ్మవారి దసరా పూజా మండపాలు నిర్వహణ, దేశవ్యాప్తంగా ప్రతి రోజూ లక్షన్నర మంది భక్తుల సందర్శనకు వస్తారని, ఈ సమయంలో 50 రోజుల పాటు సెక్షన్ 144 అమలు ఎందుకన్నారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో పోలీసుల ఆంక్షలు ఆశ్చర్యకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నాలుగున్నరేళ్ళలో పాలనలో నాలుగేళ్ళు నిర్బంధనలు, సెక్షన్ 144తో నడిపారున్నారు. విజయవాడ ప్రతిష్ట , భక్తుల మనోభావాలు ప్రభుత్వానికి, పోలీసులకు పట్టదన్నారు. ఇపుడు అప్రస్తుతంగా సెక్షన్ 144 ఎందుకు పెట్టారో కనీసం ప్రజలకి వివరంగా చెప్పాలని ప్రభుత్వాన్ని, పోలీసు శాఖ అధికారులను డిమాండ్ చేశారు.

## ఉపాధ్యాయ సేవాదల్ సేవలు అభినందనీయం

**విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) :** ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి విద్యా ప్రమాణాల అభివృద్ధికి గత పది సంవత్సరాలుగా ఉపాధ్యాయ సేవాదళ్ అహర్నిశలు సేవలు అందించడం అభినందన మైనార్టీ వెల్ఫేర్ స్పెషల్ సెక్రటరీ ఎండి ఇంతియాజ్ కొనియాడారు. డెమొక్రటిక్ పి.ఆర్.టి.యు, ఆంధ్ర ప్రదేశ్ అనుబంధంగా పనిచేస్తున్న విద్యాసామాజిక సేవా విభాగం లో ఉపాధ్యాయ సేవాదల్ ఏర్పాటు చేసి పదేళ్లు పూర్తయిన సందర్భంగా గాంధీనగర్‌లోని వారి కార్యాలయంలో ఒక సమావేశం నిర్వహించారు.రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ డి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో రూపొందించబడిన పోస్టర్‌ను మైనార్టీ వెల్ఫేర్ స్పెషల్ సెక్రటరీ ఎండి ఇంతియాజ్,కృష్ణ-గుంటూరు జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి,రాష్ట్ర పబ్లిక్ పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానంద రెడ్డి, లయన్ నాయకులు మల్పూర్ ఉపేంద్ర అవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి విద్యా ప్రమాణాన్ని అభివృద్ధికి ఉపాధ్యాయ సేవాదళ్ అహర్నిశలు చేస్తున్న సేవలు బాగున్నాయి అన్నారు. ఒక పక్క ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ మరోపక్క రక్తదాన శిబిరాలు కోవిడ్ సర్వీస్ క్యాంప్లను, మెడికల్ క్యాంపులు,ప్రతిభ పురస్కారాలు, స్టడీ మెటీరియల్ పంపిణీ వంటి విద్యా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సేవాదల్ నిర్వాహకులను అభినందించారు.రాష్ట్ర పబ్లిక్ పరీక్షలు విభాగం డైరెక్టర్ డి.దేవానంద రెడ్డి మాట్లాడుతూ సేవాదల్ నిర్వహించిన 400 కు పైగా సేవా కార్యక్రమాలు చేయటం సంతోషకరం రానున్న రోజుల్లో మరింత విస్తరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి పి. వెంకటేశ్వరరావు, లయన్ నాయకులు ఉపేంద్ర, ఆదూరి వెంకటరత్నం, అబ్రహం లింకన్, పిఆర్టియు నేతల మర్రి ప్రభాకర్, నున్న రాంబాబు, అక్బర్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

# 29న ఉపాధ్యాయుల సమస్యలపై ధర్నా

**విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) :** పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఇతర పెండింగ్ బకాయిల విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఏపిటిఎఫ్) అధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో ఈనెల 29న విజయవాడ ధర్నా చౌక్'లో ధర్నాను నిర్వహిస్తున్నామని దీనిని ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఏపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయరాజు,ప్రధాన కార్యదర్శి యస్.చిరంజీవి కోరారు. బుధవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ధర్నా పోస్టర్‌ను నాయకులు విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్వీసుపరమైన, విద్యారంగ సమస్యలతో పాటు ఆర్థికపరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, పాత పెన్షన్ విధానం అమలు చేస్తామన్న ముఖ్యమంత్రి గారు హామీ నెరవేర్చకపోగా జిపిఎస్ అనే మరో కొత్తవిధానాన్ని తీసుకురావడం జరిగిందనీ అది ఉద్యోగులు, ఉపాధ్యాయులలో తీవ్రమైన నిరాశ, నిస్పృహలను కలిగించిందనీ అన్నారు.అదేవిధంగా ఉపాధ్యాయులు రోజువారి బోధనేతర కార్యక్రమాలు, వివిధ యాప్స్ అప్లోడింగ్స్ లలో తలమునకలై ఉన్నందున బోధనా సమయం సరిపోక బోధన కుంటుపడుతున్నదని పలుదఫాలుగా అధికారుల దృష్టికి తీసుకొని వచ్చినా ఫలితం లేకుండా పోయినదని అన్నారు.ఈ పరిస్థితిని సవరించకుండా పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి పర్యవేక్షణ పేరుతో ఉపాధ్యాయులను అధికారులను దూషిస్తుండడం, సస్పెన్షన్‌లు చేయడం కూడా ఉపాధ్యాయులను తీవ్రంగా బాధిస్తున్నదని అన్నారు.పాఠశాలల విలీనం వలన, సమాంతర మాధ్యమం అమలు లేనందున పాఠశాల విద్య నిర్వీర్యం అయ్యే పరిస్థితులు సంతరించుకొన్నాయని, పలుదఫాలుగా అధికారులకు విన్నవించుకున్నా, ఏకపక్షంగా పాఠశాలల విలీనం చేయడం జరిగిందనీ, దరిమిలా ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల బాట పట్టారని అన్నారు. అంతేకాకుండా విలీన ప్రక్రియ అనంతరం ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు వర్క్ లోడ్ పెంచి నాణ్యమైన విద్య అందిస్తూ ఉన్న వారికి కూడా చికాకు కలిగించడం జరుగుచున్నదని అన్నారు.నాడు- నేడు స్కీమ్ కింద లక్షలు ఖర్చుపెట్టి మౌళిక వసతులు కల్పించిన పాఠశాలలు సైతం విలీన ప్రక్రియ వలన మూసివేత స్థితికి వచ్చాయని, అంతేకాకుండా పాఠశాల విద్యను ఒక మార్చిన వైనం కనపడుతుందనీ, బ్లాక్ బోర్డులు తీసివేసి, గ్రీన్ బోర్డులు పెట్టడం, అవి వాడీవాడక మునుపే వాటిని తీసివేసి ఐఎఫ్‌పి ప్యానల్స్ పెట్టడం లాంటి ప్రయోగాలు, సి.బి.ఎస్.ఇ అమలు అరకొరగా ఉండగానే,ఐబి (ఇంటర్నేషనల్ బ్యాకులరేట్) విధానంపై ఆలోచన చేయడం,టోఫెల్ లాంటి ఆచరణ సాధ్యం గాని గందరగోళ విధానాలతో గాలిమేడలు కట్టడం దరిమిలా విద్యాశాఖను ఒక ప్రయోగశాలగా మార్చడం వలన పాఠశాల విద్య ఉన్న స్థితి కన్నా. దిగజారుతూవున్నదని విమర్శించారు.అశాస్త్రీయమైన విలీన ప్రక్రియను చేయడం వలన ఉన్న ఉపాధ్యాయ పోస్టులను మిగులుగా చూపి డిఎస్సీ నోటిఫికేషన్ ఉండని పరిస్థితి చూసి నిరుద్యోగ ఉపాధ్యాయులు తీవ్ర కలతకు గురౌతున్నారని ఆవేదన. వ్యక్తం చేశారు.ఇదిలా ఉండగా ప్రతినెలా తాము దాచుకున్న ప్రావిడెంట్ ఫండ్, గ్రూప్ ఇన్సూరెన్స్ లపై రుణాల మంజూరు ఎనిమిది నెలలుగా పెండింగ్ ఉండడం, ఆర్జిత సెలవులను నగదుగా మార్చుకునే దరఖాస్తులు ఒకటిన్నర సంవత్సరం పైగా పెండింగ్‌లో వుండడం వలన మొత్తం గా 2800 కోట్ల బకాయిలు ఏర్పడ్డాయని అన్నారు.సిపిఎస్,ఓపిఎస్ ఉద్యోగులకు 2018 నుండి రావాల్సిన డి.ఏ బకాయిలు క్యాష్,పియఫ్ ఖాతాల్లో జమ కాకపోవడం తో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.పి.ఆర్.సి,డి.ఎ బకాయిలు మొత్తంగా 25 వేల కోట్ల బకాయి ఉన్నదని,ఇక వైద్యం విషయానికి వస్తే ఉద్యోగుల హెల్త్ కార్డులను కార్పొరేట్,ప్రైవేట్ ఆస్పత్రులు అనుమతించకపోవడం వలన సొంత ఖర్చులతో వైద్యం చేయించుకుని మెడికల్ రీఇంబర్స్ మెంట్ పద్ధతిలో బిల్లును సబ్మిట్ చేసి ఉండగా ఒకటిన్నర సంవత్సర కాలంగా మంజూరుకు నోచుకోక పెండింగ్లో ఉన్నాయనీ, జనవరి నెల నుండి మెడికల్ రీఎంబర్స్మెంట్ బిల్లులను సబ్మిట్ చేసుకోవడానికి సి.ఇ.ఓ, వైయస్సార్ ఆరోగ్య శ్రీ ట్రస్ట్ ప్రొసిడింగ్స్ ఆథరైజేషన్ కు ఖజానా శాఖ అనుమతి లభించలేదనీ అన్నారు. దశాబ్దాలుగా విద్యారంగ,ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల సంక్షేమంపై పనిచేస్తున్న ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలను ఏమాత్రం ఖాతరు చేయకపోవడం, ఏదైనా కొత్త స్కీమ్ అమలుచేసే ముందు చర్చల్లోని అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవడం లాంటి ప్రజాస్వామ్య వాతావరణం లేకపోవడాన్ని కూడా వారు విమర్శించారు. అలాగే అనేక సమస్యలు ఉన్నాయని వాటిని ఈనెల 28లోపు పరిష్కారం చేయాలని లేకుంటే పెద్దఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సి.హెచ్ దీలీప్‌కుమార్, నాగరాజు, రాజు, నరసింహా రావు, మేకల సుబ్బారావు, వెళ్ళగణి రాజు, తదితరులు పాల్గొన్నారు.